
# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**రాష్ట్ర పునర్నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి**

- సీఎం చంద్రబాబు పిలుపు
- జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి 2



## సంక్రాంతికి సొంతూరికి..

సంక్రాంతి పండుగ సందర్భంగా సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లికి చేరుకున్నారు. గ్రామస్థులు పలువురు సీఎం చంద్రబాబును కలవగా, పేరుపేరునా పిలిచి మాట్లాడారు. సీఎం చంద్రబాబు అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

## ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పంపిణీ

- తిరుచానూరులో ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- వినియోగదారుడి ఇంట్లో స్వయంగా టీ తయారు చేసిన సీఎం
- కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరా
- ఇంటి నిర్మాణానికి రూ. 4లక్షలు మంజూరు
- 4 ఆవుల కొనుగోలుకు రూ. 2లక్షలు అందజేత

4



## నా ధ్యేయం..

# పేదరికం లేని రాష్ట్రం

- తెలుగు ప్రజలందరూ కలిసి రావాలి
- సంక్రాంతి వేదికగా సంకల్పం తీసుకోవాలి
- పెద్ద పండుగరోజు తొలి అడుగు పడాలి
- పీ 4 అమలుపై సీఎం చంద్రబాబు పిలుపు
- మనం బాగుండాలి...మనతో పాటు అందరూ బాగుండాలి...అప్పుడే నిజమైన పండుగ
- ఆర్థిక అసమానతల తగ్గింపు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- అదే పీ-4 విధానం స్ఫూర్తి
- జన్మభూమి స్ఫూర్తితో భాగస్వాములు కావాలి
- దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు ముందుకు రావాలి
- జీరో పావర్టీ విధానంపై ఎక్స్‌లో విధాన పత్రం విడుదల
- ప్రజలనుంచి సూచనలు, సలహాలు, స్వీకరిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2



# క్లీన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ

- భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుదాం
- కాలుష్యరహిత ఇంధన వాడకాన్ని ప్రోత్సహిద్దాం
- ఇంధన రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- సీఎన్జీ ఆధారిత వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన సీఎం

3




సీఎం చంద్రబాబు విజన్‌కు

## గ్రీన్ కో ప్రాజెక్ట్ నిదర్శనం

- 2018లోనే ఎంవోయూ కుదిరింది
- 2019లో వచ్చిన ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవటం హాస్యాస్పదం
- గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టింది
- మంత్రి టీజీ భరత్ వెల్లడి

5

# క్రీడాంధ్రప్రదేశ్‌గా ఏపీ

- అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- రూ.50 కోట్లతో వైజాగ్ స్టేడియం ఆధునీకరణ పనులు
- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి
- మంగళగిరిలో అట్టహాసంగా ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం
- ఏటా మంత్రి లోకేష్ పుట్టిన రోజున ప్రైడ్ ఆఫ్ మంగళగిరి క్రికెట్ పోటీలు

7



**మంత్రులు అచ్చెన్న, పార్థసారథి, కొల్లు రవీంద్ర సంక్రాంతి శుభాకాంక్షలు** 5

## వివేకానంద బోధనలు యువతకు ఆదర్శం

- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని యువత దూసుకెళ్లాలి
- జాతీయ యువజనోత్సవంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు

4




## నా ధ్యేయం..

# పేదరికం లేని రాష్ట్రం

## తెలుగు ప్రజలందరూ కలిసి రావాలి - సంక్రాంతి వేదికగా సంకల్పం తీసుకోవాలి

- పెద్ద పండుగరోజు తొలి అడుగు పడాలి
- పీ 4 అమలుపై సీఎం చంద్రబాబు పిలుపు
- మనం బాగుండాలి... మనతో పాటు అందరూ బాగుండాలి... అప్పుడే నిజమైన పండుగ
- ఆర్థిక అసమానతల తగ్గింపు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- అదే పీ-4 విధానం స్ఫూర్తి
- జన్మభూమి స్ఫూర్తితో భాగస్వాములు కావాలి
- దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు ముందుకు రావాలి
- జీరో పావర్టీ విధానంపై ఎక్స్‌లో విధాన పత్రం విడుదల
- ప్రజలనుంచి సూచనలు, సలహాలు, స్వీకరిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు పీ 4 (పబ్లిక్ -ప్రైవేటు- పీపుల్- పార్టనర్‌షిప్) విధానంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఇందుకు సంక్రాంతి వేదికగా తొలి అడుగు పడాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో పండుగ శోభ వికసిల్లాలని, మనం, మనతో పాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండటమే పండుగ అని తెలిపారు. ఆర్థిక అసమానతలు తొలగిపోయి, సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానన్నారు. ఇందులో భాగంగా ప్రతిపాదించిన పీ-4 విధానంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆరోగ్య, ఆదాయ, ఆనంద రాష్ట్రం కోసం సంకల్పం తీసుకుందామని కోరుతూ ఎక్స్ వేదికగా తన మానస పుత్రిక పీ 4 విధాన పత్రాన్ని ఆదివారం సీఎం చంద్రబాబు విడుదల చేశారు. దీనిపై అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు.

### నెంబర్ వన్‌గా తెలుగు జాతి

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి, తెలుగు రాష్ట్రాల ప్రజలకు, దేశవిదేశాల నుంచి జన్మభూమికి వచ్చి బంధుమిత్రులతో సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న వారందరికీ శుభాకాంక్షలు. ఉన్నతమైన మన సంస్కృతీ, సాంప్రదాయాలు వర్ధిల్లాలి. ప్రతి ఇంట్లో పండుగ శోభ వికసించాలి. మనం బాగుండాలి...మనతో పాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలి. అప్పుడే నిజమైన పండుగ. ఆర్థిక అసమానతలు తగ్గించి సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ప్రజల జీవితాల్లో వెలుగు తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర -2047 విజన్‌ను ఆవిష్కరించాం. ఇందులోని పది సూత్రాల ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం. వీటిలో ప్రథమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పీ 4 విధానం.

### సంస్కరణల ఫలాలు అన్ని వర్గాలకూ చేరాలి

ఉమ్మడి రాష్టంలో 1995లో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది ప్రజల జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన పీ 3 (పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్లు సైతం నాటి అవకాశాలతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అనేక వర్గాల వారు దేశ, విదేశాల్లో మంచి స్థానాలకు చేరుకున్నారు. గ్లోబల్ సిటిజన్స్ గా వెళ్లి...నేడు గ్లోబల్ లీడర్స్ అవుతున్నారు. అత్యధిక తలసరి ఆదాయం సాధించి తెలుగు ప్రజల సత్తా చాటుతున్నారు. నాటి సంస్కరణ ఫలాలు అన్ని వర్గాలకు చేర్చాల్సిన బాధ్యత ఉంది. ఇప్పటికీ లక్షల కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నేటికీ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది కటిక పేదరికంలోనే ఉన్నారు. విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు, సమాజాన్ని శక్తివంతంగా చేసేందుకు పీ4 విధానాన్ని ప్రతిపాదించి నేడు విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నాను. తమ శక్తి యుక్తులతో, ప్రభుత్వ పాలసీతో సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు...అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు చేయూతనిచ్చి పైకి తేవాలని కోరుతున్నాను. పేద వర్గాల చదువులకు, ఉపాధి అవకాశాలకు, నైపుణ్యం పెంచేందుకు ఒక పద్ధతి ప్రకారం చేయూతనిస్తే వారి కుటుంబాలు నిలబడతాయి.

### అట్టడుగు వర్గాలకు చేయూత ఇవ్వాలి

సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవసరమైన నాలెడ్జ్, సాంకేతికతను అందించి మార్గ నిర్దేశనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తేవచ్చు. ఎవరు ఎక్కడ స్థిరపడినా వారి మాతృ భూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతను అందించి వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చు. సమాజంలో తమకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఆయా రంగాల్లో అగ్రస్థానాల్లో ఉన్న వాళ్లు సమాజానికి తమవంత తిరిగి ఇచ్చే ఆలోచనలు చేయాలి. ఉన్నత స్థానాల్లో ఉన్న వాళు ,,ఎన్ఆర్‌ఐలు తమకు తెలిసిన పేదలకు మెంటార్‌గా ఉండడం, అవకాశాలు కల్పించడం, అండగా ఉండడం ద్వారా సమాజంలో పెనుమార్పులు తీసుకురావచ్చు. నాడు జన్మభూమి స్ఫూర్తితో చేపట్టిన కార్యక్రమాలు గ్రామాల్లో అద్భుత ఫలితాలను ఇచ్చాయి. నాడు ఇచ్చిన పిలుపుతో ఎన్ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి అనేక గ్రామాల రూపురేఖలు మార్చారు. నేడు అదే స్ఫూర్తితో అట్టడుగున ఉన్న పేదలకు అవకాశాలు కల్పించి వారిని పైకి తెచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను.

### ప్రజల భాగస్వామ్యంతో లక్ష్యాన్ని సాధిస్తాం

పేదరికం లేని సమాజం మా నినాదం, మా విధానం. ప్రగతికి ప్రతిబంధకంగా ఉన్న పేదరికాన్ని రూపుమాపడం మా లక్ష్యం. ప్రభుత్వం చేసే కార్యక్రమా లతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. రాష్ట్ర ప్రజలతో పాటు పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన ప్రతి ఒక్కరు దీనిపై చర్చించాలని కోరుతున్నాను. పొరుగువారికి సాయం చేయడం ద్వారా మీరు సాధించిన విజయానికి సార్థకత చేకూరుతుంది. పీ4 విధానంపై ప్రతి ఒక్కరి సలహాలు, అనుభవాలు, ఆలోచనలు, సూచనలు స్వీకరించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీని కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్ తీసుకువచ్చి 30 రోజుల పాటు ప్రతి ఒక్కరి ఆలోచనలు స్వీకరిస్తాం. ప్రజల భాగస్వామ్యంతో జీరో పావర్టీ లక్ష్యాన్ని చేరుకుందాం. తెలుగు జాతిని నెంబర్ 1 చేసే క్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై కలిసి రావాలని ప్రజలను వినమ్రంగా కోరుతున్నాను. పేదల జీవితాలు మార్చే కార్యక్రమంలో నేను సైతం అని ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేలా సంక్రాంతి రోజున సంకల్పం తీసుకోవాలని కోరుతున్నాను. తద్వారా ఆరోగ్య, ఆనంద, అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌ను సాధిద్దామని సీఎం చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

# రాష్ట్ర పునర్నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**- సీఎం చంద్రబాబు పిలుపు**

**- జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి**

అమరావతి (చైతన్యరథం): యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే..దానిని సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్న యువతీ,యువకులకు ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుంది.. అంటూ అద్భుతమైన సందేశాన్ని ఇచ్చిన స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో, పేదరిక నిర్మూలనలో, సమసమాజ స్థాపనలో యువశక్తి భాగస్వామి కావాలి. శక్తివంతమైన సోషల్ మీడియా, ఇంటర్ నెట్, ఏఐ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయకుండా మీ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలి. ఈ ఐదేళ్ళలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు నిత్యం శ్రమిస్తున్నాం. అలాగే ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేసే లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. దేశంలో మొదటిసారిగా స్కిల్ సెన్సెస్ చేపడుతున్నాం. మీరు లక్ష్యాలను నిర్దేశించుకోండి. వాటిని చేరుకునేందుకు మీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

చైతన్యరథం

# క్లీన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ

- భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుదాం
- కాలుష్యరహిత ఇంధన వాడకాన్ని ప్రోత్సహిద్దాం
- ఇంధన రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- సీఎన్జీ ఆధారిత వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన సీఎం






తిరుపతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్లీన్, గ్రీన్‌ఎనర్జీ హబ్‌గా దిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. భవిష్యత్లో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలుష్యరహిత ఇంధన వాడకాన్ని ప్రోత్సహిద్దామని పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

తిరుపతిలోని తిరుచానూరులో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పంపిణీ పథకాన్ని సీఎం చంద్రబాబు ఆదివారం ప్రారంభించారు. తరువాత తిరుపతిలోని హోటల్ తాజ్‌లో ఏజీ అండ్ పీ ప్రథమ్ - థింక్ గ్యాస్ సంస్థ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని సీఎన్జీ వాహనాల ర్యాలీని జెండా ఊపి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం జపనీస్ పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ ఇంధన రంగంలో దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ సంస్థల్లో ఒకటైన ఏజీ అండ్ పీ మరింతగా తమ వాణిజ్య కార్యకపాపాలను విసరిస్తున్నందుకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. తిరుచానూరులో ఏజీ అండ్ పీ ప్రథం - థింక్ గ్యాస్ సంస్థ ఏర్పాటు చేసిన డైరెక్ట్ పైపులైన్ ద్వారా గ్యాస్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వారితో మాట్లాడానన్నారు. తిరుపతి నుండి నూతన సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టులను ప్రారంభించుకోవడం సంతో షంగా ఉందన్నారు. గ్రీన్ ఎనర్జీ వల్ల అనేక ఉపయోగాలున్నాయని, 99 లక్షల కుటుంబాలకు గ్యాస్ సరఫరా చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రానికి పుష్కలంగా సహజ వనరులున్నాయి. హైవేలు, సముద్రతీరం, పోర్టులు, విమానాశ్రయాలు ఉన్నాయి. ఇంటింటికీ గ్యాస్ సరఫరాకు 5 కంపెనీలను సంప్రదించాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర కోసం పని చేస్తున్నామని వివరించారు.

## క్లీన్, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత

ప్రపంచ వ్యాప్తంగా ఫ్యూయల్ ఎనర్జీలో మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు పొయ్యిలో వంట చేసుకునే వాళ్ళం. స్వచ్ఛమైన, సురక్షితమైన సహజ వాయువుతో కూడిన సీఎన్‌జీ పైప్ లైన్‌తో ఇంటికి కనెక్ట్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రం క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, వాడకంలో ముందుకెళ్లాలి. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ హబ్ గా మారనుంది. అందులో భాగంగా సీఎన్‌జీ, పీఎన్‌జీ సహజ వాయువుల కనెక్షన్లు ప్రారంభించాం. ఏజీ అండ్ పీ కంపెనీ ప్రస్తుతం రాజస్తాన్, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలు అందిస్తోంది. 80 లక్షల మందికి క్లీన్ గ్యాస్ ఇస్తున్నారు. 28 జిల్లాల్లో 1500 సీఎన్‌జీ స్టేషన్లతో గ్యాస్ అందించగలుగుతున్నారు. ఏజీ అండ్ పీ సంస్థ 2030 సంవత్సరానికి 15 శాతం మార్కెట్ షేర్ సాధించేలా ముందుకు వెళున్నారని, అందుకు వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

మన రాష్ట్రంలోని గోదావరి బేసిన్ ద్వారా 40 శాతం సహజ వాయువు ఉత్పత్తి జరుతోంది. దీనిని మన రాష్ట్రంలో వినియోగించుకునేందుకు పూర్తి సహకారం అందిస్తాం. 2014-19లో భాగ్యనగర్ గ్యాస్, గోదావరి గ్యాస్, మెగా గ్యాస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఏజీ అండ్ పీ కంపెనీలకు 11,120 కోట్ల పెట్టుబడితో 99 లక్షల కుటుంబాలకు కనెక్షన్లను మంజూరు చేసేందుకు 8 శాతం న్యాచురల్ గ్యాస్ ట్యాక్సేషన్‌తో అనుమతులు ఇచ్చాం. తరువాత గత 5 సంవత్సరాల్లో వీటిని నిర్లక్ష్యం చేసి గత ప్రభుత్వం టాక్స్ 24 శాతం చేయడంతో ఈ సంస్థలు తమ కార్యక్రమాలు ఆపేసి ఇతర రాష్ట్రాలకు వెళ్ళాయి. తిరిగి మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్యాక్స్‌ను 5 శాతానికి తగ్గించాం. కొన్ని నెలల ముందు శ్రీ సిటీలో గ్యాస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్ ప్రారంభించాం. గత 5నెలల్లో ఈ కంపెనీ..51 కంపెనీలతో సంబంధాలు ఏర్పరుచుకుని, ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం చంద్రబాబు అభినందించారు.

## ప్రపంచ మార్కెట్‌తో పోటీపడాలి

ప్రపంచ వ్యాప్తంగా అనేక మార్పులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ కోరుకుంటున్నారు. ఇటీవల మన ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించింది. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి, 7.5 లక్షల మందికి ఉపాధి టార్గెట్‌తో ప్రభుత్వం పని చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ - 2047 లక్ష్యంగా, రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర ప్రదేశ్ -2047 లక్ష్యంగా పనిచేస్తున్నాయి. భవిష్యత్తులో ఇంధన ఖర్చును తగ్గించుకోవడం, గ్రీన్ హైడ్రోజన్, క్లీన్ ఎనర్జీ , గ్రీన్ ఎనర్జీ, సీఎన్‌జీ వంటి వాటిని ఉపయోగించడం, వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంతో మన ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో భాగంగా విశాఖపట్టణంలో ఎన్‌టిపిసి, జెన్ కో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు 1.80 వేల కోట్లతో శంకుస్థాపన చేశారు. అదే విధంగా రిలయన్స్ సంస్థ బయో ఫ్యూయల్ ప్లాంట్లను రూ. 60 వేల కోట్లతో 500 ప్రాంతాలల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గ్రీన్ కో సంస్థ కర్నూలు జిల్లాలో సోలార్ విండ్, పంప్డ్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. అలాగే కాకినాడ పోర్ట్‌లో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటవుతోంది. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారనుంది. వ్యర్థాల నుండి విద్యుత్ తయారుచేయడం, సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. మన రాష్ట్రం సీఎన్‌జీకి అనువైన ప్రదేశం. ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు సీఎన్‌జీ అందితే బాగుంటుంది. మన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడేలా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఇంధన రంగంలో అపార అవకాశాలు

ఏజీ అండ్ పీ కంపెనీ మన రాష్ట్రంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపూర్ జిల్లాలలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కలిగి ఉంది. రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 10 వేల మందికి పైగా ఉపాధి అందిచేందుకు కృషి చేస్తోంది. వారికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుంది. తాజాగా తిరుచానూరులో డొమెస్టిక్ పైప్‌లైన్ సహజ వాయు సరఫరాను, సీఎన్జీ ఆధారిత వాహనాలను ప్రారంభించుకున్నాం. గాజులమండ్యంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ), సీఎన్జీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను, చిత్తూరులో ఏజీ అండ్ పీ ప్రథమ్ థింక్ గ్యాస్ సీఎన్జీ మదర్ స్టేషన్‌ను ప్రారంభించడం, నెల్లూరులో ఏజీ అండ్ పీ థింక్ గ్యాస్ ఎల్‌సీఎన్‌జీ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం శుభ పరిణామమని సీఎం చంద్రబాబు అన్నారు. ఎనర్జీ సెక్టార్‌లో భారత దేశానికి మంచి అవకాశాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో పంప్డ్ ఎనర్జీకి మంచి అవకాశం ఉంది. అలాగే సీఎన్‌జీ, న్యాచురల్ గ్యాస్‌కు మంచి డిమాండ్ ఉంది. వీటన్నింటినీ రాష్ట్ర అభివృద్ధికి అనుకూలంగా మార్చుకోవాలి. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెంది ఇతర రాష్ట్రాలకు పోటీగా నిలుస్తుంది. మన ప్రభుత్వంలో పెట్టుబడిదారులకు స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. పెట్టుబడిదారులు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎరువులు, పురుగు మందులు వాడకుండా వ్యవసాయాన్ని కొత్త పద్ధతిలో చేసి సహజ సిద్ధంగా పండించేలా వినూత్న విధానాలు అమలు చేస్తున్నాం. తద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం చేకూరుతుంది. కొత్త పద్దతులు, కొత్త టెక్నాలజీలను అందరూ అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు.

## కాలుష్య రహిత ఇంధనం.. లక్ష్యం

రాష్ట్ర ప్రజలకు పీఎన్‌జీ గ్యాస్ అందించేందుకు ఏజీ అండ్ పీ కంపెనీ ప్రభుత్వం నుండి సబ్సిడీలు కోరుతోంది. దేవాలయాల్లో కూడా పీఎన్‌జీ గ్యాస్ వాడేందుకు అనుమతి ఇవ్వాలని అడుగుతోంది. వాటిని పరిశీలిస్తాం. ఏజీ అండ్ పీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. 2047 నాటికి తెలుగుజాతి కూడా పారిశ్రామికంగా నంబర్ వన్‌గా ఉండాలనేది నా ఆశాభావం. క్లీన్ ఎనర్జీ మా ప్రభుత్వ లక్ష్యం. జపాన్ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి సంబంధాలు ఉన్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరుతున్నాం. ఎనర్జీ ఖర్చు, లాజిస్టిక్ ఖర్చు తగ్గిస్తూ అలాగే కాలుష్య రహిత ఎనర్జీ మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పొడవైన సముద్ర తీరం ఉంది. పోర్టులు, విమానాశ్రయాలు, హైవేలు ఉన్నాయి. పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన రాష్ట్రం. కాలుష్య రహిత సమాజం కోసం మేము కృషి చేస్తున్నాం. 1999లో దేశంలోనే మొదటిసారి విద్యుత్ సంస్కరణలు తెచ్చాం. విద్యుత్ రంగంలో మరిన్ని సంస్కరణలు రావాల్సి ఉంది. సీఎన్జీ ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అనుకూలంగా ఉంటుంది. పెట్టుబడిదారులకు స్వాగతం పలుకుతున్నాం. మన రాష్ట్రం త్వరలోనే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులు ఎగుమతి చేస్తాం. ఇంతకు ముందు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళ్ళాం. ఇప్పుడు దానితో పాటు స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో అడుగులు ముందుకు వేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏజీ అండ్ పీ ప్రథమ్- థింక్ గ్యాస్ ఎండీ, సీఈఓ అభిలేష్ గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక పీఎన్‌జీ కనెక్షన్‌ను ప్రారంభించారని, త్వరలోనే లక్ష ఇళ్ళకు ప్రభుత్వ సహకారంతో గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో తమ సంస్థ పనిచేస్తోందని, ప్రజల జీవన నాణ్యతలో మార్పు తెచ్చే సహజ వాయువు పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి 700 కి.మీ.లకు పైగా ఉక్కు, ఎండిపిఇ పైప్‌లైన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం తమ కంపెనీ ఆటోమోటివ్ విభాగానికి సేవలందించే 51 సీఎన్‌జీ స్టేషన్‌లతో బలమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉందని, అలాగే దేశీయంగా 23,000 గృహాల వంట గదులకు చేరుకున్నామని, కాలుష్య రహిత పర్యావరణం కోసం సహకరించే క్రమంలో 50 పారిశ్రామిక - వాణిజ్య వినియోగదారులకు సహజ వాయువును సరఫరా చేస్తున్నామని తెలిపారు.

రాబోయే కొద్ది సంవత్సరాల్లో, ఆంధ్రప్రదేశ్‌లో తమ పెట్టుబడి రూ.10,000 కోట్లను దాటనుందని, అలాగే 10,000 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీసిటీలో ప్రారంభించిన గ్యాస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లో రానున్న 3 నెలల్లో అన్ని పరిశ్రమలకు న్యాచురల్ గ్యాస్ అందుబాటులోకి రానున్నదని తెలిపారు. తిరుపతిలో ప్రారంభించిన ఈ కార్యక్రమాలు గ్రీన్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడంలో రాష్ట్రప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తున్నాయని, పరిశుభ్రమైన, పచ్చదనం, సంపన్నమైన పారిశ్రామిక భవిష్యత్తు వైపు రాష్ట్ర ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో పెట్టుబడులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ శాఖల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఐఅండ్ఐ ఎండి దినేష్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్, డా.ఎస్.వెంకటేశ్వర్, ఏజీ అండ్ పీ ప్రథమ్ థింక్ గ్యాస్ కంపెనీ సీనియర్ లీడర్‌షిప్ బృందం, జపనీస్ పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జపనీస్ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి సన్మానించారు.

# ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పంపిణీ

- తిరుచానూరులో ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- వినియోగదారుడి ఇంట్లో స్వయంగా టీ తయారు చేసిన ముఖ్యమంత్రి
- కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరా
- ఇంటి నిర్మాణానికి రూ. 4లక్షలు మంజూరు
- 4 ఆవుల కొనుగోలుకు రూ. 2లక్షలు అందజేత





తిరుపతి (చైతన్యరథం): తిరుపతిలోని తిరుచానూరులో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పంపిణీ పథకాన్ని సీఎం చంద్రబాబు ఆదివారం ప్రారంభించా రు. తిరుచానూరులో నివాసముంటున్న శరవణ ఇంటి ని సందర్శించి ఏజీ అండ్ పీ ప్రథమ్ సంస్థ అమర్చిన డొమెస్టిక్ పైపులైన్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరాను ప్రారంభించారు. అనంతరం శరవణ ఇంట్లో స్వయంగా టీ తయారు చేసి, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గ్యాస్ పైప్ లైన్ గురించి అడగగా వారు ఈ గ్యాస్ పైప్ లైన్ చాలా ఉపయోగ కరంగా ఉందని చెప్పారు. ప్రతిసారి సిలిండర్లు అయిపోతే మళ్ళీ సిలిండర్ తెచ్చుకునేవరకు ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదన్నారు. 24 గంటలు గ్యాస్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం లేదన్నారు. మీటరు అమర్చుతారని ఎంత గ్యాస్ వాడితే దానికి మాత్రమే ప్రతినెల కరెంట్ బిల్లు లాగా గ్యాస్ బిల్లు కట్టుకోవడానికి చాలా సులభతరంగా ఉంటుందని తెలిపారు. వారి వృత్తి, ఆర్థికపరమైన విషయాలు గురించి అడగగా తాను కార్పెంటర్ పని చేస్తున్నానని ప్రస్తుతం పనులు లేవని, రెండు ఆవులు ఉన్నాయని తెలిపారు. తమకు సొంత ఇల్లు లేదని తెలుపగా అప్పటికప్పుడే గృహనిర్మా ణ సంస్థ ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేశారు. అదనంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేసి, పీఎంఈజీపీ కింద 4ఆవులకు రూ.2లక్షలు మంజూరు పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, గాలి భాను ప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి (చైతన్యరథం): నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతికి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికైన మంద జగన్నాథం రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చి ఉన్నత చదవులు చదివిన జగన్నాథం... తెలుగుదేశం పార్టీ నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచి ప్రజాసేవ చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంద జగన్నాథం హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు.

# వివేకానంద బోధనలు యువతకు ఆదర్శం

- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని యువత దూసుకెళ్లాలి - జాతీయ యువజనోత్సవంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు








విజయవాడ (చైతన్యరథం): స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని యువత లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పిలుపు ఇచ్చారు. భారతదేశంలో జన్మించిన మహనీయుల్లో స్వామి వివేకానంద అగ్రగణ్యుడన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నేషనల్ యూత్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశోక్ బాబు మాట్లాడుతూ దేశానికీ ఆస్తి యువతేనని, రాబోయే 30 సంవత్సరాలు వారివేనన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించనున్నారన్నారు. ఇటీవల జరిగిన ఫాలీఫెస్ట్ సమిట్‌లో మన యువత అద్భుత ప్రదర్శనా పాటవాలు ప్రదర్శించారన్నారు. దేశంలో యువతకు నేడు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. యువత వారి కెరీర్‌ను వారే నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అమెరికాలోని చికాగాలో స్వామీ వివేకానంద ప్రబోధించిన విలువలు అందరికీ ఆదర్శమన్నారు. మహాత్మా గాంధీ, డా. బీఆర్ అంబేద్కర్ కోవలోనే స్వామి వివేకానంద సమాజానికి ఎంతో సేవలు అందించారన్నారు. రాష్ట్రంలో యువతకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తూ చక్కటి ప్రోత్సాహం ఇస్తోందన్నారు. యువతలో అద్భుతాలు సృష్టించగల నైపుణ్యాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తు కోసం కలలు కనాలి, వాటిని సాకారం చేసుకునే విధంగా కష్టపడాలన్నారు. మాతృ భాషకు చాలా ప్రాముఖ్యం ఉన్నదన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత తమ కెరీర్ ను రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఎప్పుడైనా మీ గ్రామానికి వెళ్ళినప్పుడు మీరు చదువుకున్న విద్య వల్ల మీ కుటుంబానికి గౌరవం తీసుకురావాలన్నారు.

యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కే శారదాదేవి మాట్లాడుతూ కలకత్తా నగరం ఎంతోమంది ప్రముఖులకు జన్మస్థానంగా నిలిచిందన్నారు. అందులో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. చికాగో నగరంలో జరిగిన ప్రపంచ సర్వ మత ప్రార్ధనల్లో పాల్గొని భారతీయతను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఆనాడే ఇండియా గురించి గర్వంగా తెలియజేశారన్నారు. ఆ తర్వాత ఆయన ప్రాచుర్యం దేశం నలుచెరగులా విస్తరించిందన్నారు. రామకృష్ణ పరమ హంస శిష్యుడిగా రామకృష్ణ మఠాలను దేశంలో నెలకొల్పారన్నారు. రామకృష్ణ మఠాల్లో యువతకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. వివేకానంద జయంతిని 1984వ సంవత్సరంలో జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించారన్నారు. ప్రతీ సంవత్సరం దేశ ప్రధాని ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. యువతీ యువకులు స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు.

ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి.డి.ఎస్. రామకృష్ణ, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల సిఈవో యు. శ్రీనివాస్, ఏలూరు సిఈవో ప్రభాకరరావు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో

# సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం





రేణిగుంట (చైతన్యరథం): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, డీఐజీ షిమోషి బాజ్పాయ్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఇంచార్జి జిల్లా ఎస్పీ మణికంఠ ఛందోలు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, నగరి, గంగాధర నెల్లూరు, ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట ముని ప్రసాద్(నాని), బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, డాక్టర్ వి.యం థామస్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, కోలా ఆనంద్, బాలసుబ్రహ్మణ్యం, హరి ప్రసాద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, సిఆర్ రాజన్, తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన బయల్దేరి తిరుపతిలో ఏజీ అండ్ పీ ప్రథమ్ – థింక్ గ్యాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు.

## సీఎం చంద్రబాబు విజన్‌కు

# గ్రీన్ కో ప్రాజెక్ట్ నిదర్శనం



- 2018లోనే ఎంవోయూ కుదిరింది
- 2019లో వచ్చిన ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవటం హాస్యాస్పదం
- గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టింది
- మంత్రి టీజీ భరత్ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): కర్నూల్ జిల్లాలోని ఓర్వకల్లు మండలం పిన్నాపురం దగ్గర నిర్మించిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే తలమానికమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో రాష్ట్రానికి తీసుకువచ్చారని తెలిపారు. 2018లో గ్రీన్ కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్.. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. సీఎం చంద్రబాబు విజన్ కు ఈ ప్రాజెక్టు ఒక నిదర్శనం అన్నారు. 2018లోనే ఎంఓయూ కుదుర్చుకున్న ఈ ప్రాజెక్టును 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవటం ఆశ్చర్యంగా ఉందన్నారు. నిజం చెప్పాలంటే గత గవర్నమెంట్ ఈ ప్రాజెక్టు విషయంలో ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పలు అనుమతులు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఎంతో జాప్యం చేసిందన్నారు. గ్రీన్ కో ప్రాజెక్టును సరైన విధంగా ముందుకు తీసుకువెళ్లాలన్న ఆలోచన కూడా అప్పటి ప్రభుత్వ పెద్దలకు లేదన్నారు. ప్రజలందరికీ వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి భరత్ అన్నారు. అప్పటి జీవో కాపీని చూస్తే విషయం అందరికీ తెలుస్తుందన్నారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే గ్రీన్ కో ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయని ఒక ప్రకటనలో మంత్రి భరత్ వివరించారు.




# రైతు పండుగ సంక్రాంతి

### - మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలకు వ్యవసాయమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి అంటేనే రైతు పండుగ. పొలాల్లో ధాన్యలక్ష్మి ధన లక్ష్మిగా రైతుల ఇంటికి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో అన్నదాతల ఇంట సంక్రాంతి శోభ కనిపిస్తోంది. ఉద్యాన రైతుల ఇంట సూక్ష్మ సేద్యం పరికరాలతో, గ్రామాల్లో మినీ గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలతో, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో, గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు, రాష్ట్రమంతా అభివృద్ధి పనులతో ఈ ఏడాది సంక్రాంతి పండుగ ఎంతో సందడిగా మారింది. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులతో ఈ ఏడాది సంక్రాంతి శోభాయమానంగా మారిందంటూ రాష్ట్ర ప్రజలకు, రైతన్నలకు, మత్స్యకారులకు, పశు పోషకులకు మంత్రి అచ్చెన్నాయుడు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతి పండుగ
## కొత్త వెలుగులు, ఆనందం నింపాలి


### - మంత్రి కొలుసు పార్థసారథి



అమరావతి (చైతన్యరథం): సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పాత్రికేయ మిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

### - మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి (చైతన్యరథం): తెలుగు సంస్కృతి, సంప్రదాయాల కలగలుపు సంక్రాంతి సందర్భంగా ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, పిల్లా పాపలతో.. గంగిరెద్దుల కోలాహలంతో రైతన్నల సంక్రాంతి, పిండి వంటల ఘుమఘుమల కనుమ ప్రతి లోగిలిలో వెలుగులు నింపాలని, రాష్ట్రం పాడి పంటలతో.. సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.

చైతన్యరథం







సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలోని స్వగృహానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికిన చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి నరసింహ యాదవ్ తదితరులు

### ఇది సీఎం చంద్రబాబు విజన్..

# మంత్రి లోకేష్ సాధించిన ఘన విజయం

## ఏపీతో ఇండ్‌చిప్ సెమీ కండక్టర్స్ ఒప్పందం - దేశంలోనే తొలి ప్రైవేట్ సెమీ కండక్టర్ తయారీ కేంద్రంగా ముందడుగు

అమరావతి, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ మరోసారి వికసించింది. ఐటీ మంత్రి లోకేష్ చొరవ ఫలించింది. అంతర్జాతీయ విఫణిలో అత్యంత కీలకమైన సెమీ కండక్టర్ చిప్ తయారీలో దేశానికే ఆంధ్రప్రదేశ్ తిరుగులేని చోదక శక్తిగా మారుతోంది. తాజాగా సాధించిన విజయంతో భారతదేశం చిప్ తయారీలో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి ఏపీ మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ తన భాగస్వామి జపాన్‌కు చెందిన ఎంఎస్‌తో మైక్రో టెక్నాలజీతో కలిసి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో చేతులు కలిపింది. రూ. 14,000 కోట్లకు పైగా పెట్టుబడితో దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ సెమీకండక్టర్ తయారీ కేంద్రం స్థాపించడానికి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం అత్యాధునిక ఫెసిలిటీ సిలికాన్ కార్బైడ్ ఎస్ఐసీ చిప్స్ తయారీలో దృష్టి సారించడంలో భారతదేశ సాంకేతిక అభివృద్ధి, సుస్థిర లక్ష్యాలకు కీలకంగా తోడ్పడనుంది. గత నవంబర్ 2024లో ప్రకటించిన సెమీకండక్టర్ పాలసీ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ తయారీలో హబ్‌గా మారుస్తోంది. ఈ కొత్త సౌకర్యంతో ప్రారంభంలో నెలకు 10,000 వాఫర్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభమవుతుంది, తదుపరి రెండు మూడేళ్లలో 50,000 వాఫర్స్ ఉత్పత్తికి చేరుకుంటుంది. ఈ పెట్టుబడి ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో అనుసంధానమై,



విద్యుత్ వాహనాలు, నూతన ఇంధన పరికరాలు, పునరుత్పత్తి శక్తి పరిష్కారాల యొక్క పెరుగుతున్న గ్లోబల్ డిమాండును తీర్చేందుకు దోహదం చేస్తుంది. ఈ అవగాహన ఒప్పందం ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చోరియా, (ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు( (ఏపీఈడీబీ) సీఈఓ సాయికాంత్ వర్మ మధ్య సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఐటీ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఇండిచిప్ డైరెక్టర్లు డాక్టర్ సందీప్ గార్గ్, వెబ్ చాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ప్రెసిడెంట్ రవి ఏవీ జేవీ భాగస్వామ్య ప్రతినిధులు డేవిడ్ యార్క్ యువాన్ చాంగ్ (చైర్మన్, యితో మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, జపాన్), మోటోసుగి తీసుకె (సీఈఓ, వైఎంటీసీ), ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు.

దీనిపై ఐటీ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, "ఈ పెట్టుబడి ఆంధ్ర ప్రదేశ్ వినూత్న పాలసీలు, బలమైన మౌలిక సదుపాయాల ద్వారా ఆధునిక పరిశ్రమలను ఆకర్షించే సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. నైపుణ్యాన్ని పెంపొందించడానికి మెరుగైన మద్దతు అందించడానికి మేం తీసుకుంటున్న చర్యలు ఈ ప్రాజెక్ట్ విజయానికి తోడ్పడతాయి. భారతదేశ గ్లోబల్ సెమీకండక్టర్ అభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాయి" అన్నారు.

పరిశ్రమల మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ "ఈ భాగస్వామ్యం ఆంధ్ర ప్రదేశ్‌ను తయారీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టడం లక్ష్యంగా ఉంది. ఈ కేంద్రం స్థాపన వేలాది ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా, నూతన ఆవిష్కరణలకు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేస్తుంది" అన్నారు. ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చోరియా మాట్లాడుతూ, "సాంకేతిక ఆవిష్కరణల ద్వారా జాతీయ నిర్మాణానికి మేం కట్టుబడి ఉన్నామనే సంకేతం ఈ ప్రాజెక్ట్, సిలికాన్ కార్బైడ్ చిప్స్‌పై దృష్టి సారించడం ద్వారా, భారతదేశ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, గ్లోబల్ సెమీకండక్టర్ పరిశ్రమకు మేం తోడ్పడతాము" అన్నారు.

డాక్టర్ సందీప్ గార్గ్, డైరెక్టర్, ఇండిచిప్, మాట్లాడుతూ, "ఈ భాగస్వామ్యం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సృష్టించడమే కాకుండా, విద్యుత్ వాహనాలు, పునరుత్పత్తి శక్తి రంగాలలో పెరుగుతున్న అవసరాలకు ఉద్దేశించి స్థిరమైన భవిష్యత్తుకు బాట వేస్తుంది" అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అవసరమైన భూమిని, మౌలిక సదుపాయాలు, ఎకోసిస్టమ్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఈ ఒప్పందంతో ఆంధ్ర ప్రదేశ్ సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రాధాన్యత పెరిగి, భారతదేశ సాంకేతిక పురోగతికి దిక్సూచిగా నిలుస్తుంది.

# పేదల పెన్నిధిగా సీఎం సహాయ నిధి

### అనారోగ్య బాధితులకు ఆరోగ్య మంత్రి చెక్కుల పంపిణీ

పుట్టపర్తి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (ఎంఆర్ఎఫ్) ద్వారా 6గురు అనారోగ్య బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం వివిధ రకాల సహాయ కార్యక్రమాలను ప్రవేశపెట్టి, అనారోగ్య బాధితులకు సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకుని, ఆపత్కాలంలో వారికి మద్దతుగా నిలవడానికి నిరంతరం



సంకల్పబద్ధంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అనారోగ్య బాధితులు సహాయం చేయడానికి ప్రాధాన్యత ఇస్తూ, ఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతోమంది ప్రజలకు సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి బాటలు

**- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి**

కనిగిరి (చైతన్యరథం):ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చినఇర్లపాడులో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదివారం గోకులం షెడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులాల నిర్మాణం ద్వారా గోవుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడి, పాడిపరిశ్రమను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పాడి రైతుల కోసం వేల సంఖ్యలో గోకులాలు నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# క్రీడాంధ్రప్రదేశ్‌గా ఏపీ

- అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- రూ.50 కోట్లతో వైజాగ్ స్టేడియం ఆధునీకరణ పనులు
- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి
- మంగళగిరిలో అట్టహాసంగా ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం
- ఏటా మంత్రి లోకేష్ పుట్టిన రోజున ప్రైడ్ ఆఫ్ మంగళగిరి క్రికెట్ పోటీలు



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్, సిజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నవులూరు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ పోటీలను విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఉదయం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాసేపు సరదాగా క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఎంపీఎల్ లీగ్ టోర్నమెంట్ లో మొదటి మ్యాచ్ లో తలపడిన మంగళగిరి టీమ్, విజయనగరం జిల్లా టీమ్‌కి ఎంపీ కేశినేని శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ టాస్ వేయగా మంగళగిరి టీమ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.

మంగళగిరిలో నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఈ ప్రీమియర్ లీగ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ఈ నెల 23వ తేదీన ఈ ప్రీమియర్ లీగ్ ముగుస్తుంది. ప్రీమియర్ లీగ్‌కు వచ్చిన క్రీడాకారులను సత్కరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల టీమ్‌లు ఈ లీగ్‌లో పాల్గొంటున్నాయి. విజేతలతోపాటు రన్నరప్‌లుగా నిలిచిన వారికి 23వ తేదీన ప్రైజ్‌మనీతో పాటు కప్ అందిస్తారు.

ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ మంగళగిరి ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి లీగ్ ఇదేనని వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో తమ అందరి కంటే ముందున్నారని కొనియాడారు. ఎంపీఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు మంగళగిరి ప్రీమియర్ లీగ్ పేరుతో మంత్రి నారా లోకేష్ ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో నియోజకవర్గం స్థాయికే పరిమితం అయిన ఈ క్రికెట్ పోటీలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సహకారంతో ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మంగళగిరి టీమ్‌తో పాటు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కో టీమ్ పాల్గొందన్నారు. ఈ లీగ్ ఫైనల్ మ్యాచ్ జనవరి 23వ తేదీ జరుగుతుందని, ఆ రోజే విన్నర్స్ తో పాటు ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకి బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు. ఈ లీగ్ మ్యాచుల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన క్రికెట్ క్రీడాకారులకి ఏసీఏ తరుఫున ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీఏ తరఫున క్రీడాకారులకు అవసరమయ్యే మైదానాలతో పాటు అకాడమీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయనగరంలో ఏర్పాటు చేయనున్న క్రికెట్ అకాడమీ జనవరి నెలాఖరులో ప్రారంభం కానుందన్నారు. అనంతపురంలోని లేడీస్ క్రికెట్ అకాడమీ ఈ నెలాఖరుకు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజధాని ప్రాంతంలో రెండు స్టేడియాలు ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజధాని ప్రాంతం అమరావతి, గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తెనాలి ప్రాంతాల క్రీడాకారులకి ఈ స్టేడియాలు అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని రూ.50 కోట్లతో ఆధునీకరిస్తున్నామన్నారు. మార్చి నాటికి పనులు పూర్తి చేసి ఐపీఎల్ మ్యాచ్ విశాఖలో జరిగే విధంగా కృషిచేస్తున్నామని చెప్పారు. జీఎంఆర్ ఆధ్వర్యంలోని ఢిల్లీ డేర్ డెవిల్స్ ఆడే రెండు మ్యాచ్‌లు వైజాగ్‌లో జరుగుతాయని వెల్లడించారు. యువ క్రీడాకారులు స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ వంటి నేతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగితే అంత ఒదిగి ఉండాలన్నారు. ఏదో ఒక మ్యాచ్‌లో ఓడిపోయామని నిరుత్సాహ పడొద్దన్నారు. మంగళగిరిలో 2019 ఎన్నికల్లో ఓడిపోయిన నారా లోకేష్ మళ్లీ పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని చెప్పారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలను ఏసీఏ తరపున ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఏపీని క్రీడాంధ్రప్రదేశ్ గా రూపుదిద్దుతామన్నారు. ఎంతోమంది క్రీడాకారులు రావాలి. రాబోయే కాలంలో ఐపీఎల్‌కు ఏపీ నుంచి 25 మంది ఎంపికయ్యేలా కృషిచేస్తాం. ఇప్పటికే ఆరుగురు ఎంపికయ్యారన్నారు. ఆస్ట్రేలియాపై సెంచరీ చేసిన నితీష్ కుమార్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.


ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, రాష్ట్ర నాయి బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు కందుల నాగార్జున, పర్వత మధుసూదన్, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, తాడేపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, గోసాల రాఘవ, కొత్త శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, జోన్నాదుల బాలకృష్ణ, సంకా బాలాజీ గుప్తా, చావలి ఉల్లయ్య, తోట పవన్, దిండ్ల సంత్యానందం, దేవరపల్లి మహేష్(చంటి) మద్దిరాల రమేష్ బాబు, తురకా వీరశేఖర్, యలమంచిలి పద్మజ, కాటబత్తుని నిర్మల, చిట్టెం అవినాష్, తిరుమలశెట్టి కొండలరావు, తిరుమలశెట్టి మురళీ కృష్ణ, తోట సాంబయ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.











# యువతకు స్ఫూర్తిప్రదాత వివేకానంద

## - మంత్రి లోకేష్ నివాళి

అమరావతి (చైతన్యరథం): భారతీయ యువతకు స్ఫూర్తిప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాపితం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆ మహనీయునికి రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా నివాళులర్పించారు. స్వామి వివేకానంద తత్వాలు, బోధనలు, ఆలోచనలు భారతదేశానికి ఆయనిచ్చిన గొప్ప సాంస్కృతిక సంపద అని కొనియాడారు. లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకండి.. అని వివేకానంద నినదించారు. దేశ బలం, శక్తి.. యువత చేతుల్లోనే ఉంది. అనంతశక్తి మీలోనే దాగిఉందని, బలహీనులమని భావించకండి.. అంటూ యువతలో చైతన్యజ్వాలలు రగిలించారు. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు యువతే కీలకం. వివేకానంద స్ఫూర్తిని కొనసాగిద్దాం అంటూ మంత్రి లోకేష్.. అందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



### ఆర్థిక ఇబ్బందులున్నా

# ఉద్యోగులకు మేలు చేసేందుకు కృషి

- బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి
- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ఒంగోలు (చైతన్యరథం): రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేసేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రభుత్వం పోలీసు ఉద్యోగులకు జీపీఎఫ్, సీపీఎస్, సరెండర్ లీవుల బకాయిలు విడుదలకు నిర్ణయం తీసుకోవటంపై ఆదివారం నాడు పలువురు పోలీసు ఉద్యోగులు తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, మంత్రి డోలాకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు, కాంట్రాక్టర్లు, పోలీసు సిబ్బందికి బకాయిలు చెల్లించేందుకు రూ.6,700 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ఉద్యోగులు ఏ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగులంతా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి డోలా సూచించారు.

# యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

## - మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి (చైతన్యరథం): యువతకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శి, భారత సంస్కృతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆయనకు మంత్రి కొల్లు నివాళులర్పించారు. స్వామి వివేకానంద తన ప్రబోధాలతో యువతకు సనాతన ధర్మ విలువలను తెలియజేసిన విధానం అందరికీ ఆదర్శమన్నారు. వివేకానందుడి జీవితం యువతకు మార్గ నిర్దేశం లాంటిదన్నారు. ఆయన ఆలోచనలు, బోధనలు నేటికీ యువతను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్టుగా ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి, రాష్ట్రానికి అవసరం అన్నారు. వివేకానందుని స్ఫూర్తితో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దుదామని పిలుపు ఇచ్చారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర యువతరానికి మంత్రి కొల్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏపీలో క్రీడాభివృద్ధికి నిధులు కేటాయించండి

- అన్ని జిల్లాల్లోనూ యూత్ హాస్టళ్లు నిర్మించాలి
- ప్రధాని మోదీకి ఎంపీ హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వినతి
- ఢిల్లీలో నేషనల్ యూత్ డే ఫెస్టివల్లో ప్రధానిని కలిసిన నేతలు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలవైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ప్రధాని నరేంద్రమోదీకి అమలాపురం ఎంపీ, సెంట్రల్ స్పోర్ట్స్ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు జీఎమ్ హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విన్నవించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన నేషనల్ యూత్ డే ఫెస్టివల్‌లో ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాని మోదీని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవీయ, ఎంపీ హరీష్‌తో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మాండవీయ ఆహ్వానం మేరకు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2025 కార్యక్రమానికి ఏపీ నుంచి 68 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో క్రీడారంగం అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి మాండవీయకు ఎంపీ హరీష్, శాప్ ఛైర్మన్ రవినాయుడు వినతిపత్రం అందజేశారు. గతంలో ఏపీలోని క్రీడాకారులకు యూత్ హాస్టల్స్ ప్రయోజనకరంగా ఉండేవని, ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకోవడంతో, క్రీడాకారులకు వసతి సదుపాయం లేక ఇబ్బందిపడుతున్నారని ప్రధాని మోదీకి వివరించారు. క్రీడాకారుల ప్రయోజనార్థం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ యూత్ హాస్టళ్లను నిర్మించాలని విన్నవించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలవైపు ప్రోత్సహించేందుకు కేంద్రం సహకరించాలని, ఏపీలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని వారు కోరారు.

### కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన శాప్ ఛైర్మన్..

న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ యూత్ డే ఫెస్టివల్‌లో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ఎంపీ జీఎమ్ హరీష్ బాలయోగితో కలిసి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీలో విద్యాశాఖ, క్రీడాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు వివరించారు.



# రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

## - అధికారులకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆదేశం

శ్రీకాకుళం (చైతన్యరథం): రథసప్తమి వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అరసవల్లి దేవాలయంలో రథసప్తమి వేడుకల కోసం జరుగుతున్న ఏర్పాట్లను దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణతో కలిసి ఆదివారం మంత్రులు పరిశీలించారు. రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు.





# తిరుపతి తొక్కిసలాట బాధితులకు చెక్కులు పంపిణీ

విశాఖపట్నం (చైతన్యరథం): ఇటీవల తిరుపతిలో వైకుంఠ ఏకాదశి రోజున టోకెన్‌లు పంపిణీ దగ్గర జరిగిన తొక్కిసలాటలో గాయపడిన విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలం జిఎస్ఎన్ రాజు నగర్‌కు చెందిన బి.శ్రీనివాసరావకి ఆదివారం విశాఖపట్నం విమానాశ్రయంలో ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి చేతుల మీదగా గాయపడిన వ్యక్తికి 2 లక్షల రూపాయలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకట రత్నాజీ, నాయకులు గోగాడ జగన్నాథం నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహంగా 5కె మారథాన్ రన్

విశాఖపట్నం (చైతన్యరథం): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద యూత్ మారథాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5కె మారథాన్ గాజువాక డిపో సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నుండిమల్కాపురం వరకు యూత్ రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా విప్ గణబాబు 5కె రన్‌ని ప్రారంభించారు . వారితో పాటు మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, అత్యధికంగా యువత పాల్గొన్నారు . ఈ మారథాన్ రన్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ప్రభుత్వ విప్ గణబాబు చేతుల మీదుగా పతకాలు బహుకరించారు.



## స్వామి వివేకానందకు ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు నివాళి

విశాఖపట్నం (చైతన్యరథం): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ తన అద్భుత ప్రసంగాలతో సమాజంపై, ముఖ్యంగా యువతపై అత్యంత ప్రభావం కలిగించిన ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడు, శ్రీరామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు, రామకృష్ణ మిషన్ వ్యవస్థాపకుడు, భవిష్యత్ తరాలకు మార్గదర్శి అయిన స్వామి వివేకానంద అని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఇవే నా ఘన నివాళులని, ప్రజలందరికీ జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుపతి ఘటనలో బాధితులకు పరిహారం అందజేత

విశాఖపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం తిరుపతి ఘటనలో బాధితులకు ఆదివారం పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 89 వార్డ్ కార్పరేటర్ దాడి వెంకటరమేశ్, టీడీపీ నాయకులు బొడ్డేటి విజయ్, టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉద్యోగులు, విద్యార్థులు, రైతులకు బకాయిల విడుదల

◆ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టీకరణ



విజయనగరం (చైతన్యరథం): సంక్రాంతి సందర్భంగా గుత్తేదారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతుల్లో సంతోషం నింపేందుకు ప్రభుత్వం సంక్రాంతి వరాలు ప్రకటించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పలు రకాలుగా గత ఐదేళ్లుగా ఉన్న రూ. 6,750 కోట్లు పెండింగ్ బిల్లులు విడుదల చేయటం లబ్ధిదారులకు సంక్రాంతి వరమేనని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జీపీఎఫ్, సీపీఎఫ్, టీడీఎస్‌కు సంబంధించి రూ.1300కోట్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్టుమెట్రిక్ ఉపకారవేతన బకాయిలు కలపి రూ.788 కోట్లు సీఎం విడుదల చేశారని తెలిపారు. చిన్నగుత్తేదారులకు రూ. 586 కోట్లు బకాయిలు ఇవ్వటంతో 20వేల మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. బకాయిల విడుదలతో ఆయా వర్గాల కుటుంబాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం కల్పించామని తలిపారు. 7 నెలల పాలనలో సంక్షేమంతో పాటూ, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేస్తున్నామని మంత్రి తెలిపారు.

జిల్లాలో పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. పెట్రో కెమికల్, ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బయోటెక్నాలీజి, ఎలక్రికల్ వాహన పరిశ్రమలు ఉత్తరాంధ్రలో నెలకొల్పేందుకూ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు పీపీపీ విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.









# నాలుగు కొత్త బస్సులు ప్రారంభించిన మంత్రి కొండపల్లి

విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జోనల్ చైర్మన్ దొన్న దొరతో కలిసి ఆదివారం విజయనగరం ఆర్టీసీ డిపోను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. స్థానికంగా ఉన్న పరిస్థితలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయనగరం, ఎస్.కోట, పార్వతీపురం డిపోలకు చెందిన 4 నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల కాలంలోనే విజయనగరం రీజియన్ పరిధిలో దాదాపు ఇరవై వరకు నూతన బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పని చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విజయనగరం డిపో గేరేజీ ఆవరణలో మొక్కలను నాటారు.





# పోటీ పరీక్షల పుస్తకాల అందజేత

శ్రీకాకుళం (చైతన్యరథం): ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమం-2025 కింద గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సన్నాహమవుతున్న అభ్యర్థులకు పుస్తకాల మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్న ఆలోచనతో బుక్ రాకను గ్రంథాలయాలకు అందజేశారు. అందులో భాగంగా జాతీయ యువజన దినోత్సవం నాడు గ్రంథాలయంలో బుక్ రాక్‌ను ప్రారంభించారు. సర్దార్ గౌతు లచ్చన్న తాత, యర్రనాయుడు ఇద్దరూ తమ జీవితాలను ప్రజాసేవకే అంకితం చేశారని తెలిపారు. వారు ఎప్పుడూ విద్యకు కేంద్రంగా శ్రీకాకుళం ప్రాంతాన్ని ఊహించారనరి, వారి వారి వారసులు అయిన మేము ఈరోజు వారి స్ఫూర్తితో శ్రీకాకుళం ప్రాంత అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళ్లడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.








# అంబరాన్నంటిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు

- ఆకట్టుకున్న రంగవల్లులు
- ఉత్కంఠభరితంగా ఈత పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట (చైతన్యరథం): సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు ఆదివారం కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈత పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈత పోటీలలో విజేతలకు పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే సత్యానందరావు బహుమతులు అందజేశారు. 70 సంవత్సరాల వయసు గల మహిళ కూడా కిలోమీటర్ ఈతల పోటీలలో పాల్గొనడం విశేషం. అంతేకాకుండా ప్రత్యేక ప్రతిభావంతులైన ఇద్దరు యువకులు కూడా ఈతల పోటీలలో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచారు. అలాగే వృత్తి రీత్యా అమెరికాలో ఉంటున్న మహిళ ఇటీవల రాష్ట్రానికి రావడంతో ఈ పోటీల గురించి తెలుసుకుని ఈత పోటీలో పాల్గొన్నారు.

విజేతలు : కిలోమీటర్ దూరం మహిళల ఈత పోటీలలో మొదటి స్థానం శకుంతలదేవి (విజయవాడ), రెండవస్థానం కృష్ణ డింపుల్, మూడవ స్థానం సౌజన్య కైవసం చేసుకున్నారు.

55 సంవత్సరాల పైబడి మహిళల ఈతల పోటీలలో మొదటి స్థానం వై ఏసమ్మ , రెండవ స్థానం పి లక్ష్మి, మూడవ స్థానం నాగమణి నిలిచారు.

45 సంవత్సరాల పైబడి పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం పి శివ గణేష్ (సర్కిల్ ఇన్స్పెక్టర్), రెండవ స్థానం అప్పల నాయుడు, మూడవ స్థానం టిపి రావు నిలిచారు.



45 సంవత్సరాల వయసు లోబడి పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం సాయి నిహాన్, రెండవ స్థానం జగదీష్, మూడవ స్థానం బాల గంగాధర్ నిలిచారు.

15 సంవత్సరాల వయసు లోబడి పిల్లల ఈత పోటీలలో మొదటి స్థానం ఎండి సిద్ధ, రెండవ స్థానం ఎస్ కె సాజామిన్, మూడవ స్థానం జే యశస్విని నిలిచారు.

రంగవల్లుల పోటీలలో జి అమ్మాజీ (మొదటి స్థానం), కె సృజన (రెండవ స్థానం), టి ఆదిశ్రీ (మూడవ స్థానం) విజేతలుగా నిలిచారు.

100 మీటర్ల 30-45 సంవత్సరాల వయస్సు మహిళల ఈత పోటీలలో మొదటి స్థానం - సింపుల్ కృష్ణ, రెండవ స్థానం - శకుంతల దేవి

100 మీటర్ల 30-45 పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం - తులసి చైతన్య, రెండవ - కె నాగకృష్ణ, మూడవ స్థానం - శివ గణేష్

100 మీటర్ల 45 సంవత్సరాల పైబడి పురుషులు మొదటి స్థానం - అప్పల నాయుడు, రెండవ స్థానం - వి శ్రీనివాసరాజు, మూడవ స్థానం - ఎం శ్రీనివాసరావు.

100 మీటర్ల 45 సంవత్సరాల పైబడి మహిళల ఈతల పోటీలలో



మొదటి స్థానం - ఏసుమణి, రెండవ స్థానం - సీతారామమ్మ, మూడవ స్థానం - పి లక్ష్మి

అనంతరం ఆత్రేయపురం గోదావరి తీరంలో నిర్వహించిన పతంగుల పోటీలను ఎమ్మెల్యే సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డీ, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), ముళ్ళపూడి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, గుత్తుల రాంబాబు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా పడవ పోటీలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో కేరళ తరహాలో పడవ పోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే సత్యానందరావు ఆధ్వర్వంలో ఈ పోటీలు నిర్వహించారు. దీంతో పాటు ఈత పోటీలు జరిగాయి. వీటిని తిలకించేందుక పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఆత్రేయపురంలోని ప్రధాన పంట కాల్వలో ఈ పోటీలు జరిగాయి.

# సీఎంఎఫ్ఆర్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట (చైతన్యరథం): వైద్యం ఖర్చుల రీయింబర్స్‌మెంట్ నిమిత్తం నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న పలువురికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపాలెం కార్యాలయం వద్ద ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. వాసా కాశీవిశ్వనాదం, సంధిపూడి, రూ -25, 166/- శీలం లక్ష్మి, దేవరపల్లి, రూ - 67110/-, సూరపురెడ్డి లక్ష్మి మంగ తాయారు, సంధిపూడి,రూ - 31759/-, కడలి దుర్గా ఆది భవాని, తాడిపూడి,రూ - 23400/-, కొమ్ముల పుత్రయ్య, కొమరాజులంక,రూ - 59214/- పేరాబత్తుల ఉదయ భాను, కొత్తపేట,రూ - 49395/-. మొత్తం 2,56,044/- రూపాయలు



సొమ్ము లబ్ధిదారులకు అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే సత్యానందరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, వీళ్ళ మారుతీ, వాసంశెట్టి సత్యనారాయణ, దొడ్డ సుబ్బారావు, వక్కపట్ల లక్ష్మణ్ రావు,గుర్రాల నాగభూషణం, కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఎఫ్ఆర్ చెక్కులు అందజేత

కొవ్వూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయిన చెక్కులను శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కూటమి నాయకులతో కలసి ఆదివారం లబ్ధిదారులకు అందచేశారు. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో పిల్లి విజయలక్ష్మి రూ. 1,54,160/-, ఆళ్ళ లీలా శివ నాగరాజు రూ. 1,13,489/-, చిక్కాల గ్రామంలో కొండేటి చిన వెంకట్రావు రూ. 1,00,000/-, %ా% ముప్పవరం గ్రామంలో కాయిత ఉమా శంకర్ వెంకట కార్తీక్ రూ. 40,000/- వారికి చెక్కులను అందచేశారు.



# రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం (చైతన్యరథం): జాతీయ రహదారి ప్రమాదంలో వేరు వేరు ఘటనలలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సపర్యలు చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆదివారం జాతీయ రహదారిపై భూలోకమ్మ ఆలయం దగ్గరలో వేమగిరి నుండి రాజమండ్రి వెళుతూ ఒక యువకుడు ద్విచక్ర వాహనంతో రహదారికి ఆనుకుని ఉన్న రైలింగ్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో రాజమండ్రి నుంచి వేమగిరి వెళుతున్న మరో యువకుడు ద్విచక్ర వాహనంతో కారును ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే గోరంట్ల వారిని చూసి వెంటనే స్పందించి, హుటాహుటిన అంబులెన్స్‌ను రప్పించి ఇరువురిని దగ్గరుండి ఆసుపత్రికి పంపించారు. గాయపడిన యువకుల వివరాలు తెలుసుకుని వారు కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇది చూసిన స్థానికులు ఎమ్మెల్యే గోరంట్ల ఔదార్యాన్ని అభినందించారు.



# మంగళగిరి క్రీడా మైదానానికి మరమ్మతులు

మంగళగిరి, మంగళగిరి, (చైతన్యరథం) : మంగళగిరి క్రికెట్ స్టేడియంలో కూడా అభివృద్ధి పనులు చేయబోతున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(నాని) తెలిపారు. మద్రాస్ ఐఐటీ స్టేడియంను పరీక్షించిందన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ స్టేడియంను పన్నెండు ఏళ్లు నిరు పయోగంగా ఉంచటం వల్ల గ్యాలరీల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయని తెలిపారు. ఈ స్టేడియంను రిపేర్ చేయించి అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ స్టేడియంకు సమీప ప్రాంతంలోనే నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ సిటీలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. అన్నింటి కంటే ముఖ్యంగా యువ క్రీడకారులకు ప్రతిభతో పాటు క్రమశిక్షణ ఉండాలన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి వుండటం నేర్చుకోవాలన్నారు . రాజకీయంగా ఎంత ఎదిగినా ఒదిగి వుండే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి వుంటే అంత ఆదరణ లభిస్తుందన్నారు. ఎంపీయల్ టోర్నమెంట్‌లో పోటీపడే క్రికెటర్స్ అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు నితీశ్ కుమార్ రెడ్డి ను ఆదర్శంగా తీసుకుని రాణించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఒక మ్యాచ్ లో ఓడిపోతే నిర్సుతాహ పడకుండా ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ విషయంలో మంత్రి నారాలోకేష్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో



మంగళగిరి నియోజకవర్గంలో ఓటమి చెందిన తర్వాత, నిరుత్సాహపడకుండా గట్టి పట్టుదలతో కృషి చేసి అత్యధిక మెజార్టీతో లోకేష్ గెలిచారన్నారు. అలాగే క్రీడాకారులు కూడా ఓటమికి నిరుత్సాహ పడకుండా పట్టుదలతో ముందుకు సాగి విజయాలు అందుకోవాలని చెప్పారు. ఏసీఏ తరుఫున క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కావాలన్నా కృషి చేస్తామన్నారు. ఏసీఏ తరుఫున త్వరలో ఏపీఎల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ఏపీ నుంచి 25 మంది ఐపీఎల్‌కి సెలెక్ట్ అయ్యే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆంధ్ర నుంచి ఆరుగురుసెలెక్ట్ అయినట్లు పేర్కొన్నారు. ఇక వైజాగ్ స్టేడియాన్ని రూ. 50 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు మార్చి కల్లా పూర్తి చేసిన ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిఎమ్ఆర్ ఆధ్వర్యంలోని ఢిల్లీ డేర్ డేవిల్స్ టీమ్ మ్యాచ్‌లు రెండు జరుగుతాయన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం వద్ద ఫోర్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ రానున్న బడ్జెట్ లో శాంక్షన్ కానుందన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థుల్లో కీడల పట్ల ఆసక్తి పెంచేందుకు రానున్న కాలంలో స్టేడియంలో ఉచితంగా క్రికెట్ మ్యాచులు చూసే వెసులు బాటు , బోజన సుదపాయం కల్పించి మ్యాచులు చూసి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలో తన సొంత నిధులతో 147 ప్రభుత్వ పాఠశాలల మైదానాలను ఆధునీకరించి లాంగ్ జంప్ పిట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 23 వ తేదీన మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా 8 రకాల క్రీడా వస్తువులతో స్పోర్ట్స్ కిట్స్ ను ఎన్టీఆర్ జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఆర్యవైశ్య సంఘం నాయకులు సంకా బాలాజీ గుప్తా , టీడీపీ నాయకులు తోట పార్థ సారథి, పర్వత మధు, మున్నంగి శివ శేషయ్య, గోవాడ దుర్గారావు, మున్న షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, ఆరుద్ర భూలక్ష్మి, గోసాల రాఘవ, జొన్నదుల బాలకృష్ణ , తోట పవన్, తురక వీరశేఖర్, కొత్తా శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, జనసేన నాయకులు మునగపాటి వెంకట మారుతి రావులతో పాటు ఎన్డీయే కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

◆ ఇబ్రహీంపట్నంలో 27 గోకులాలకు రూ.57.50 లక్షలు మంజూరు

◆ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడి

◆ కేతనకొండలో గోకులం షెడ్లు ప్రారంభం



ఇబ్రహీంపట్నం, (చైతన్యరథం) : పశు సంపద అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, పశువులు కలిగిన లబ్ధిదారులకు మినీ గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు.

ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను శాసనసభ్యులు కృష్ణప్రసాదు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలంలో 27 గోకులాల షెడ్స్ నిర్మాణానికి కాను రూ.57.50 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పశుసంపదను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గోకులం షెడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ( ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో ఈ మినీ గోకులం షెడ్లను నిర్మింస్తున్నారన్నారు. 6 పశువులు కలిగిన లబ్దిదారునికి మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.3 లక్షలు, 4 పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.1.85 లక్షలు, 2 పశువుల షెడ్డు నిర్మాణానికి రూ. 1.15 లక్షలు, అదేవిధంగా 50 గొర్రెలు కలిగిన లబ్దిదారులకు రూ. 2.30 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మినీ గోకులం నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే ఉందని, ఇది మంచి ప్రభుత్వమని, ప్రజలందరూ సంతోషంగా పండగ చేసుకోవడానికి సిద్దమవుతున్నారనడానికి ఇదే నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం మిని గోకులం షెడ్లను మంజూరు చేస్తోందన్నారు. మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ మహాకూటమి, నాయకులు పాల్గొన్నారు.

### పేదలకు సీఎంఆర్ఎఫ్ సాయం

విజయవాడ/ రెడ్డిగూడెం, (చైతన్యరథం) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గారు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సహాయనిధి నుంచి రెడ్డిగూడెం మండలంలోని 8 మందికి రూ.5.94 లక్షలు మంజూరయ్యాయి. మండల కేంద్రంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఈ సాయాన్ని చెక్కులు రూపంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సందేశ పత్రాన్ని కూడా అందజేశారు. లబ్ధిదారులను పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

# గోకులాలతో పాడిరైతుకు ప్రోత్సాహం

◆ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట, (చైతన్యరథం) : నియోజకవర్గంలోని వత్సవాయి గ్రామంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆదివారం పర్యటించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న గోకులం షెడ్లను, సీసీ రోడ్లను కుటమి నాయకులతో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య గారు మాట్లాడుతూ. గోకులాల నిర్మాణంతో పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి చెంది రైతులకు ఆర్థిక చేయుత లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తర్వాత పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే 12,500 గోకులాలను నిర్మించినట్లు వివరించారు. ఒక్కొక్క గోకులాన్ని సుమారు 2 లక్షల 30 వేల రూపాయలతో నిర్మిస్తున్నామని తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు తద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి చేయూతనిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి అనేక పథకాలు ద్వారా గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తోందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కేవలం 260 గోకులాలకును మాత్రమే నిర్మించిందని గత పాలకుల నిర్లక్ష్యంతో పాడి పరిశ్రమ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. నిధులు దుర్వినియోగం తప్ప పాడి పరిశ్రమ అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉరుసు ఉత్సవాలు

◆ పాల్గొన్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే కృష్ణప్రసాదు, ఎమ్మెల్సీ జనార్ధన్

కొండపల్లి, (చైతన్యరథం) : మున్సిపాలిటీలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా బుఖారీ బాబా దర్గా 428వ ఉరుసు మహెూత్సవాలలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు, ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉర్సు కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా అతిథులను ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానించి, బాబా ఆస్థానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఉర్సులో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా భక్తులు ఉర్సు మహెూత్సవంలో పాల్గొనటం గొప్ప అదృష్టమన్నారు. భక్తులకు ఉరుసు కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, ఇతర మత గురువులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు వివేకానందుడు

◆ జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఘన నివాళి

కొండపల్లి, (చైతన్యరథం) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో బస్టాండ్ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గారు మాట్లాడుతూ. అతి చిన్న వయస్సులో స్వామి వివేకానంద పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలీజియన్స్‌లో ప్రసంగించి మన దేశ సంస్కృతిని తత్వాన్ని ప్రవేశ పెట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన మనకు ఉపదేశించిన వాక్యాలు కెరటం నాకు ఆదర్శం .. లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు, ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు, ఉక్కు సంకల్పం కలిగిన యువత, మనల్ని మనం మార్చుకుంటేనే ప్రపంచం మారుతుంది. ఇలాంటి గొప్ప సూక్తులు ఇప్పటికీ స్ఫూర్తి ని అందిస్తూనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ఏలూరి గోపాలరావు, సంగేపు బుజ్జిబాబు, గొట్టే నాగరాజు, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు, నూకల సాంబ, వేదులపురి సైదా, కర్ల జోజి, నోముల రఘు, మల్లెల కొండ, మారేపల్లి శౌరి, కటికల అనిల్, మెడక కోటేశ్వరరావు, గింజుపల్లి కృష్ణ, అన్నెపాక దుర్గా మహేశ్వర రావు, గడ్డం రాంబాబు, షేక్ సుభాని, పసుపులేటి శ్రీనివాసరావు, బొప్పాల మనోజ్, వంగూరి కోటేశ్వరరావు, తూమాటి కృష్ణ, సర్వేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# అందరికీ సకల శుభాలు కలగాలి

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు**

నెల్లూరు, (చైతన్యరథం): తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి సకల శుభాలు అందించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆకాంక్షించారు.

భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని మంత్రి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి అన్నదాతలు పాడి పంటలు, బోగ భాగ్యాలు, సిరి సంపదలతో తుల తూగాలని, అందరి కుటుంబాలలో ఆనందం వెల్లి విరియాలని రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్న మంత్రి, ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరిపై, రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వంపై ఆ భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రగతి పథంలో కూటమి ప్రభుత్వం

**- కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి**



కావలి, (చైతన్యరథం) : తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠ మేరకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ మంత్రి నారా లోకేష్ అభివృద్ధికి చేస్తున్న కృషికి అనుగుణంగా పని చేస్తున్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర పనితీరును ప్రజలు చ్చుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి కల్లయ్య అన్నారు. వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్న రైతుబిడ్డ ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి గౌరవరానికి చెందిన 79 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు అందించి కావలి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళు, వాడలన్నింటికీ రోడ్లు నిర్మాణంలో కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే కావ్యకృష్ణ రెడ్డి, జాతీయ నాయకులు బీద రవిచంద్ర, గిరిజన ప్రజలకు రాష్ట్ర ప్రజలకు భోగి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జేఎన్‌టీయూ కింద స్కిట్ కళాశాల

**మంత్రి లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే బొజ్జల**



శ్రీకాళహస్తి, (చైతన్యరథం) : స్కిట్ కళాశాలను జేఎన్టీయూ ద్వారా ప్రారంభించాలని రేణిగుంట విమానాశ్రయంలో కలిసి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఎండోమెంట్ ద్వారా నడుపుతున్న ఏకైక కళాశాల స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలని ఆయన వివరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఈ కళాశాలను ప్రైవేట్ పరం చేయాలనీ చూసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బొజ్జల గోపాల కృష్ణారెడ్డి మానస పుత్రిక అయిన ఈ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి కళాశాల ప్రారంభించడానికి అన్ని విధాల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# అందరి జీవితాల్లో సంక్రాంతి వెలుగులు

**ఎమ్మెల్యే ముత్తుముల శుభాకాంక్షలు**



గిద్దలూరు, (చైతన్యరథం): ఈ సంక్రాతి పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు విద్యా, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో ముందడుగు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో తమ కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మరియు ప్రింట్ మరియు మీడియా మిత్రులకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.

# ఆధునిక శకానికి మార్గదర్శి స్వామి వివేకానంద

**- డాక్టర్ నూకసాని బాలాజీ**



ఒంగోలు, (చైతన్యరథం): స్వామి వివేకానంద జీవిత చరిత్ర, ఆయన బోధనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ, జిల్లా యువజన సంక్షేమ శాఖ-స్టెప్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163 వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం ఒంగోలు నగరం, కొత్తపట్నం బస్టాండ్, వివేకానంద విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఆయన జ్ఞానసంపన్నుడిగా వెలుగొందాడన్నారు. వివేకానందుని కాలేజీ రోజులు ఆయన లోతైన అధ్యయనపు ప్రతిభకు నిదర్శనం. చికాగో సర్వమత సమ్మేళనంలో భారతదేశ ఆధ్యాత్మికత, యోగాల శక్తి, తత్వాలను ప్రపంచానికి తెలియజేసిన ఘనత ఆయనదే. చికాగో ప్రసంగం ద్వారా పాశ్చాత్య సంస్కృతికి భారతీయ సంస్కృతిని తారతమ్యం చేసి వివేకానందుడు ప్రపంచానికి ఒక మార్గదర్శిగా నిలిచాడన్నారు. వివేకానంద స్ఫూర్తి నేటి విద్యావ్యవస్థ బలమైన పాత్ర పోషించాలన్నారు. ప్రతి పాఠశాలలో, కళాశాలలో వివేకానందుని సూక్తులు విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉంది. వివేకానంద జీవితానికి సంబంధించిన పాఠాలను పాఠ్యాంశాల్లో చేర్చడంతో పాటు సెమినార్లు, సింపోసియాలు నిర్వహించి ఆయన భావజాలాన్ని ప్రోత్సహించాలి. సమాజంలో జరుగుతున్న నేరాలు, అసభ్యకాండలు వంటి సమస్యలను నివారించడానికి ఆయన బోధనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి సూచన మేరకు వివేకానంద సూక్తులను పాఠ్యాంశాల్లో చేర్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కొండయ్య యాదవ్, అధికారులు యువకులు పాల్గొన్నారు.

# ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్ష

**- మంత్రి మండిపల్లి సంక్రాంతి శుభాకాంక్షలు**



రాయచోటి, (చైతన్యరథం): రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాష్ట్ర, జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అందమైన రంగవల్లులు, పిండివంటలు, ఆటపాటలతో బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ప్రజలందరూ భోగి మంటల వెలుగులతో పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొంది మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలన్నారు. కనుమ కాంతులతో పల్లెసీమలు పశు సంపద, వ్యవసాయ, పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొంది ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలన్నారు.

# క్రీడలతో మానసిక వికాసం, దేహదారుఢ్యం

**- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి**

**- ఆనవాయితీగా ప్రతి సంక్రాంతికీ క్రికెట్ టోర్నమెంట్**

**- మంత్రి నారాయణ పేరున టోర్నమెంట్ హర్షణీయం**



నెల్లూరు, (చైతన్యరథం) : క్రీడలతో మనోబలం, దేహదారుఢ్యం పెంపొందించుకోవచ్చని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. 53, 54వ డివిజన్ల క్లస్టర్ ఇంచార్జ్ జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా బ్యాట్ పట్టుకొని గ్రౌండ్ లోకి దిగారు. క్రీడాకారులను అలరించారు.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.. తమది బెట్టింగుల ప్రభుత్వం కాదని వైసీపీకి అయన చురకలు అంటించారు. జహీర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తామంతా అండగా ఉంటామన్నారు.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా జహీర్ ఎన్నో సేవా కార్యక్రమాలు క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించారని గుర్తు చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కోటంరెడ్డి స్పష్టం చేశారు. బాలకృష్ణ నటించిన డాకూ మహారాజు సినిమా సూపర్ డూపర్ హిట్ అయిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మంత్రి పొంగూరు నారాయణ పేరు మీదుగా ఈ క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభిస్తున్నామని, గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటను ఆస్వాదించాలని అన్నారు.. ఈ సందర్భంగా జహీర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి విజయభాస్కర్ రెడ్డి కూడా మాట్లాడారు.. మాజీ కార్పొరేటర్‌లు సత్య నాగేశ్వరరావు,బాలాజీ పొత్తూరు శైలజ, శ్రీనివాసులు నాయుడు, జనసేన మహిళా నేత ఆలియా పాల్గొన్నారు. కో - ఆప్షన్ సభ్యులు జమీర్, షాహిద్ , పెంచలయ్య చౌదరి, సుధాకర్ రెడ్డి, సుల్తాన్, 53 ,54 డివిజన్ నాయకులు మూలం భాస్కర్, ఖాదర్ బాషా, మంజు, బాబు, షమీమ్, హసీబ్ , జలీల్, శ్రీను, అజీమ్, ముస్తాక్, ఖలీల్, తిరుపతి, బాబు, రమాదేవి, నరసింహ, రమేష్, రఫీ , శివ, ఫైజా , భాను, గణేష్, షాజహాన్, షాలు, ఆర్గనైజర్ గా వాసు , మౌళి, అబ్బాస్ వ్యవహరిస్తున్నారు. అంపైర్లుగా జ్యోతి వినయ్, విజయ్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.







# పరిపాలనాదక్షుడు చంద్రబాబు

◆ఆర్థికాభివృద్ధిలో ఏపీ ముందడుగు
◆జగన్‌రెడ్డి నిర్వాకం వల్లే ఆర్థిక కష్టాలు
◆ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి స్పష్టీకరణ
◆మినీ గోకులాలు ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి

పుట్టపర్తి (చైతన్యరథం): అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వాకం వల్లే రాష్ట్రంలో ఆర్థికలోటు ఏర్పడిందని విమర్శించారు. ఓడి చెరువు మండలంలోని కొండకమార్లలో మహిళా రైతులు సి.శ్రీదేవి, బి.శ్రీదేవి మహమ్మాదాబాద్ క్రాస్‌లో బైరిశెట్టి నిర్మించిన మినీ గోకులాలను ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ నిర్వాకం కారణంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలో అనుభవజ్ఞుడు కాబట్టే రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 మాసాల్లోనే అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల్లో అమలవుతున్నాయని తెలిపారు. ఈరోజు పేదలు సంతోషంగా ఉన్నారంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే కారణం అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని మండిపడ్డారు. ఆర్థికంగా లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధిలో ఒక్కొక్క అడుగు ముందుకు పడుతోందని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో ఏపీ పారిశ్రామిక రంగంగా అభివృద్ధి దిశగా అడుగులు పడనున్నట్లు తెలిపారు. అనంతరం పెద్దగుట్లపల్లిలో మోపురెడ్డి నిర్వహించిన విందు కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హాజరయ్యారు. పెద్ద గుట్లపల్లిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సోదరుడు పల్లె చంద్రశేఖర్‌రెడ్డి వివాహం చేసుకున్న ఎద్దుల బయపరెడ్డి , అశ్వర్త రెడ్డి ఇంటికి వెళ్ళారు. అక్కడ నుంచి నల్లగుంట్ల పల్లిలో టిడిపి కార్యకర్త 11 రోజుల దిన కర్మ కార్యక్రమాలకు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పత్తి చంద్రశేఖర్, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, పీట్లా సుధాకర్ , తుమ్మల మహబూబ్ బాషా ,నిజాం , లక్ష్మీనారాయణ రెడ్డి , జౌలి బాబా, వెంకట రంగారెడ్డి, శివారెడ్డి ,జాకీర్ ,మేకల ఈశ్వర్, రంగారెడ్డి , పూల శివ ,రామంజి, సురేష్ ,బ్రహ్మానంద రెడ్డి, బాబు రెడ్డి , బయపరెడ్డి టీడిపి , బిజెపి , జనసేన నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**టీడీపీ కార్యకర్త కుటుంబానికి పల్లె పరామర్శ**

పాముదుర్తిలో మృతి చెందిన టీడీపీ మాజీ డీలర్ లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. మృతుడు లక్ష్మీనారాయణ భౌతికకాయానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు



అర్పించారు. మృతుడు కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లక్ష్మీనారాయణ లేని లోటు ఆ కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని వారు పేర్కొన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధురరెడ్డి వెంట మండల టీడీపీ కన్వీనర్ మల్లి రెడ్డి , పాముదుర్తి సర్పంచ్ సంగా కృష్ణమూర్తి , ప్రసాద్ , టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలుగుదేశం కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. పాముదుర్తిలో టీడీపీ నాయకులతో కలసి వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె పూలమాల వేసి నివాళులర్పించారు.

# పాడి రైతుల ప్రయోజనం కోసమే గోకులం షెడ్లు

◆టీడీపీ నేత అరవ శ్రీనివాసులురెడ్డి స్పష్టీకరణ



బద్వేల్ (చైతన్యరథం): పాడి రైతుల ప్రయోజనం కోసమే ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేస్తోందని టీడీపీ నేత అరవ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అట్లూరు మండలంలోని వేములూరు గ్రామానికి చెందిన సూర గంగిరెడ్డి అనే రైతు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును ఆదివారం బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు సూర్యనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ ఇంచార్జ్ రెడ్డయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం మినీ గోకులం షెడ్లు మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం పాడిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గోకులం షెడ్లను మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సుబ్బారాయుడు, టీడీపీ నాయకులు గురుప్రసాద్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పిల్లేటి భాస్కర్ రెడ్డి, పాల చెంచిరెడ్డి , పోత్త పి నరసింహ, కాసల టైలర్ ఐవారయ్య, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



## ఉచిత వైద్యశిబిరంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి వైద్య పరీక్షలు

మడకశిర (చైతన్యరథం): అమరాపురం మండలం కె శివారం గ్రామంలో డాక్టర్ ధనుంజయ్ ఎస్ఎస్ఎం హాస్పిటల్ బెంగళూరు వారిచే ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్ మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, రఘురాం , వీర మల్లప్ప ,రంగస్వామి, ఆనంద్ కృష్ణ, రమేష్, నరేష్, రఘు, ఈరన్న,ప్రభాకర్, నాగరాజు, శివకుమార్ రవికుమార్ కాంతరాజు, మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# భృంగి వాహనంపై విహరించిన ఆదిదంపతులు

◆కనులపండువగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం (చైతన్యరథం): శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పంచాహ్నిక దీక్షతో ఏడు రోజుల పాటు జరిగే బ్రహోత్సవాల్లో రెండోరోజు ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ వేదపండితులు, అర్చకులు యాగశాలలో చండీశ్వరస్వామి, జపాలు, పంచావరణార్చనలు, నిత్యవాహనాలు, రుద్రహోమం, మండపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం ప్రదోష కాలపూజలు, హోమాలు, జపానుష్టానాలు జరిపించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలో భృంగివాహనంపై వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత గ్రామోత్సవం నిర్వహించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు, నందిమండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు ఉత్సవం కనుల పండువలా సాగింది. భక్తుల శివనామస్మరణలతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి. చెంచుకళాకారుల జానపదాలు, కోలాటాలు, హరిదాసులు విన్యాసాలతో సందడిగా ఉత్సవం సాగింది.



# మానసిక వికాసానికి క్రీడలు అవసరం

◆టీడీపీ యువ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టీకరణ

బద్వేల్: (చైతన్యరథం): మానసిక వికాసానికి, శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం అట్లూరు క్రాస్ రోడ్‌లో ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఆడిన మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ విన్నర్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా ఉండేందుకు ఎంతో దోహదపడుతుందని, ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి ఎదుర్కొంటున్నామని ఆ ఒత్తిడి తగ్గించేందుకు రోజు కొంత సమయాన్ని క్రీడల ద్వారా ఒత్తిడి తగ్గించుకోవచ్చని అన్నారు.



# సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిన స్వామి వివేకానంద

## ◆యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నివాళి



లక్నో: స్వామి వివేకానంద సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచ వేదికపై ఎలుగెత్తి చాటారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. వివేకానంద తన ప్రసంగాలలో సనాతన ధర్మం, భారతీయ సంస్కృతుల సారాంశాన్ని బోధించేవారని అన్నారు. హిందూ మతం మానవాళికి నిజమైన మార్గదర్శి అనే సత్యాన్ని ఆయన ప్రపంచ దేశాలకు తెలియజేశారని.. భారతదేశంలోని ప్రజలలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారని కొనియాడారు.

దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం యువత వల్లే సాధ్యమవుతుందని వివేకానంద దృఢంగా నమ్మేవారని పేర్కొన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడపాలని, దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. యువతకు జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అవినీతికి, అరాచకాలకు, అక్రమాలకు, సాంఘిక దురాచారాలకు యువత వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

స్వామి వివేకానంద 1863 జనవరి 12న కోల్‌కతాలోని బెంగాలీ కుటుంబంలో జన్మించారు. షికాగోలో 1893లో ప్రపంచ సర్వమత సార్వత్రిక సమ్మేళనంలో పాల్గొని సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారు. దేశ అభివృద్ధిలో యువత పాత్రపై ఎప్పుడూ అచంచల విశ్వాసాన్ని కనబరిచేవారు. అనారోగ్య కారణాల వల్ల 39 ఏళ్ల వయసులో 1902 జూలై 4న మరణించారు. వివేకానంద జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహిస్తారు.

# సీఎం స్టాలిన్‌కు అహంకారం మంచిది కాదు

## ◆తమిళనాడు గవర్నర్ ఆగ్రహం



తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్‌ఎన్ రవికి మధ్య కొంతకాలంగా భేదాభిప్రాయాలు తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఇటీవల శాసనసభ తొలి సమావేశం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ నిష్క్రమించారు. ఈ పరిణామం కాస్త గవర్నర్, సీఎం ఎంకే స్టాలిన్ మధ్య విమర్శలకు దారితీసింది. ముఖ్యమంత్రికి అంత అహంకారం మంచిది కాదంటూ తమిళనాడు రాజ్‌భవన్ తాజాగా పేర్కొంది.

"జాతీయ గీతాన్ని గౌరవించాలని, రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక విధులను నిర్వర్తించాలని చెప్పడాన్ని అసంబద్ధ చర్యగా, చిన్నపిల్లల చేష్టగా సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. దేశమే సర్వోన్నతం, రాజ్యాంగమే అత్యున్నత విశ్వాసమనే విషయాన్ని ఆయన మర్చిపోవద్దు. వాటిపట్ల అవమానాన్ని దేశ ప్రజలు సహించరు. భారత్‌ను ఓ దేశంగా గుర్తించని, ఆ దేశ రాజ్యాంగాన్ని గౌరవించని నేత.. వాటి వెనక ఉన్న ఉద్దేశాలను వంచించడం సరికాదు. ఇటువంటి అహంకారం మంచిది కాదు" అని రాజ్‌భవన్ పేర్కొంది. గవర్నర్ తీరు చిన్నపిల్లల చేష్టలా ఉందని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఈమేరకు ట్వీట్ చేసింది.

అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయ గీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా.. ఉద్దేశపూర్వకంగానే నిరాకరించారని రాజ్‌భవన్ అంతకుముందు వెల్లడించిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానించే చర్యలకు తోడుగా ఉండకూడదని సభ నుంచి గవర్నర్ వెళ్లిపోయినట్లు వివరణ ఇచ్చింది. గవర్నర్ చర్యలు ఆయన పదవికి వన్నె తేబోవని ముఖ్యమంత్రి స్టాలిన్ 'ఎక్స్'లో స్పందించారు. శనివారం మరోసారి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే రాజ్‌భవన్ ఈమేరకు స్పందించింది.




# మహా కుంభమేళాలో వాటర్ అంబులెన్స్ సేవలు!

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం మహా కుంభమేళా ప్రారంభం కానుంది. ఈ మహాకుంభమేళా ఫిబ్రవరి 26 వరకు 45 రోజులపాటు కొనసాగనుంది. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళాకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. దేశ విదేశాల నుంచి దాదాపు 40 కోట్ల మంది ఈ మహా కుంభమేళాకు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు సన్యాసులు కుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. ఈ మహాకుంభమేళా సందర్భంగా భక్తుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా తక్షణమే వైద్య సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో జాతీయ విపత్తు నిర్వహణ దళం వాటర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవరు అస్వస్థతకు గురైనా వెంటనే ఈ వాటర్ అంబులెన్స్‌లో ప్రాథమిక చికిత్స అందించనున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టుల మృతి

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య భారీ ఎత్తున కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా మావోయిస్టుల కోసం సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు జరిగాయి.

బీజాపూర్ జిల్లా మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో బందిపారా–కోరెన్‌జోడ్ అటవీ ప్రాంతంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. రెండు వైపుల నుంచి కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఘటనా ప్రాంతం నుంచి పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నారాయణపూర్ జిల్లాలో కూడా మావోయిస్టుల కోసం పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మావోయిస్టులకు సంబంధించిన భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు.



కాగా ఛత్తీస్‌గఢ్‌లో ఈమధ్యకాలంలో మావోయిస్టుల కోసం కూంబింగ్‌ను పోలీసులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 4న బస్తర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ నెల 6న మావోయిస్టుల కోసం గాలిస్తున్న డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ వాహనాన్ని మావోయిస్టులు మందుపాతరతో పేల్చారు. ఈ ఘటనలో 8 మంది జవాన్‌లతోపాటు డ్రైవర్ మరణించారు.

# అయ్యప్ప భక్తులకు ఉచిత ప్రమాద బీమా

తిరువనంతపురం: కేరళలోని శబరిమల ఆలయాన్ని పర్యవేక్షించే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) యాత్రికుల కోసం ఉచిత ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చింది. ఇటీవల జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పలువురు అయ్యప్ప భక్తులు మరణించడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీడీబీ తెలిపింది. తద్వారా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించనుంది. పథనంథిట్ట, కొల్లం, అలప్పుజ, ఇడుక్కి జిల్లాల్లో ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోయిన యాత్రికుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల పరిహారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు గాను యాత్రికుల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. వర్చువల్ క్యూ పద్ధతి లేదా స్పాట్ బుకింగ్ చేసుకున్న భక్తులకు ప్రమాద బీమా పథకం వర్తిస్తుంది.



శబరిమలలో పనిచేసే కార్మికుల కోసం టీడీబీ మరో బీమా పథకాన్ని ప్రారంభించింది. శబరిమలను శుభ్రపరిచే, పంపా నుంచి సన్నిధానం వరకు భక్తులను మోసుకెళ్లే డోలీ కార్మికులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రమాదవశాత్తు మరణించినప్పుడు, పూర్తిగా వైకల్యం సంభవించినప్పుడు రూ.10 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.5 లక్షలు పరిహారాన్ని అందించనుంది. బీమా కోసం కార్మికులు రూ.499ను ప్రీమియం రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

# గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు!

న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరయ్యే అవకాశం ఉన్నట్లు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏళ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాంటో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



గత ఏడాది ప్రబోవో ప్రధాని మోదీకి ఫోన్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చలు జరిపారు.

1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్ (రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హొలాన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కొవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్‌ను ఆహ్వానించింది.

# ట్రంప్ ప్రమాణస్వీకారానికి ఎస్.జైశంకర్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఈనెల 20వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి భారతదేశం తరఫున విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అమెరికా కొత్త పాలనాధికారులు, వివిధ దేశాల అధినేతలతో జైశంకర్ చర్చలు జరిపే అవకాశాలున్నట్టు విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ట్రంప్–వాన్స్ ఇనాగరల్ కమిటీ ఆహ్వానం మేరకు 47వ దేశాధ్యక్షుడుగా డొనాల్డ్ ఎస్.ట్రంప్ ప్రమాణస్వీకారానికి విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భారత్ తరఫున హాజరవుతున్నారని ఎంఈఏ తెలిపింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కావడం ఇది రెండోసారి.



# కెనడా ప్రధాని రేసులో లేను: అనితా ఆనంద్



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిపారు. దీంతో కెనడా ప్రధానిగా పోటీపడే మొదటి ఐదుగురిలో ప్రస్తుత రవాణా శాఖ మంత్రి అనితా ఆనంద్ ఉన్నారు. అయితే తాజాగా ఆమె ఓ కీలక ప్రకటన చేశారు. కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకొంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఓక్విల్లే పార్లమెంట్ ఎంపీగా మరలా ఎన్నికవ్వాలని కోరుకోవట్లేదని తెలిపారు.

అయితే తదుపరి ఎన్నికల వరకు ప్రస్తుతం తనకు ఉన్న బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా లిబరల్ టీమ్లో తనను స్వాగతించినందుకు.. కీలకమైన క్యాబినెట్ పోర్ట్‌ఫోలియోలను అప్పగించినందుకు ట్రూడోకు, తనను ఎన్నుకున్నందుకు ఓక్ విల్లే ప్రజలకు అనిత కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగంలో సేవలు అందించాలనుకుంటున్నట్లు తెలిపారు.

"మనం దేశానికి, సమాజానికి అనేక విధాలుగా సేవ చేయవచ్చు. ప్రజాప్రతినిధిగా కెనడాను సురక్షితంగా, బలంగా, స్వేచ్ఛగా ఉంచడానికి చేయాల్సినవన్నీ చేశాను. నేను పుట్టకముందే కెనడాకు వలస వచ్చిన నా తల్లిదండ్రులు ఈ దేశ గొప్పదనాన్ని.. మాకు అందించిన సహకారాన్ని చెప్తూ పెంచారు. కాబట్టి మా లిబరల్ టీమ్ కోసం, ఓక్ విల్లే కోసం.. అన్నింటికంటే కెనడా కోసం నేను ఇక్కడ ఉంటాను." అని అనిత పేర్కొన్నారు.

తమిళ్, పంజాబీ మూలాలున్న 57 ఏళ్ల అనితా ఆనంద్ ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 2019లో ఓక్విల్లే నుంచి ఎంపీగా ఎన్నికైన వెంటనే ట్రూడో క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 2019 నుంచి 2021 వరకు ప్రజాసేవల మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత రెండేళ్లపాటు రక్షణ మంత్రిగానూ వ్యవహరించారు. ఆమె రక్షణ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. గత నెలలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ తర్వాత రవాణా, అంతర్గత వాణిజ్య వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. అనిత తండ్రి తమిళనాడుకు చెందిన ఫిజీషియన్, తల్లి పంజాబ్‌కు చెందినవారు.

ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. దీంతో ఆయన స్థానంలో తదుపరి నాయకుడిని ఎన్నుకునే పనిలో పార్టీ నిమగ్నమైంది. ఈక్రమంలో తదుపరి ప్రధాని రేసులో లిబరల్ పార్టీ నేతలు క్రిస్టినా ఫ్రీలాండ్, మార్క్ కార్నీ, డొమినిక్ లీ బ్లాంక్, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్‌తో పాటు భారత సంతతి ఎంపీలు అనిత ఆనంద్, జార్జ్ చాహల్ పేర్లు వినిపిస్తున్నాయి.

# పాక్‌కు అనుకూలంగా బంగ్లా చర్యలు

◆భారత్ ఆందోళన



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవిని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందడం.. ఆ దేశంలోని హిందువులు, మైనారిటీలపై దాడి నేపథ్యంలో భారత్-బంగ్లా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్‌కు అనుకూలంగా పలు చర్యలు తీసుకుంటోంది. ఆ దేశంతో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు వీసా ప్రక్రియను యూనస్ ప్రభుత్వం సులభతరం చేసినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.


పాకిస్థాన్ రాయబారులు, ఉన్నతాధికారులకు వీసాలు జారీ చేసే సమయంలో ఢాకా నుంచి క్లియరెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. వీటిని తొలగిస్తున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించినట్లు పాకిస్థాన్‌లోని బంగ్లాదేశ్ హైకమిషనర్ ఇక్బాల్ హుస్సేన్ లాహెూర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వ్యాపార వర్గాలకు వెల్లడించారు. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ఆసక్తి చూపుతోందని హుస్సేన్ అన్నారు. ఇందులో భాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను పెంచడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పరస్పర వాణిజ్యం, సహకారానికి ఉన్న అడ్డంకులను తొలగించడం ఇరు దేశాల బాధ్యత అని అన్నారు.

180 మిలియన్ల జనాభా ఉన్న బంగ్లాదేశ్ పాకిస్థాన్‌కు ముఖ్యమైన వాణిజ్య మార్కెట్‌గా మారుతుందని హుస్సేన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని పాక్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాంతీయ సహకారం పెరుగుతున్నప్పటికీ, దక్షిణాసియా ఇప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటోందని.. వీటిని అధిగమించడానికి సమష్టి కృషి అవసరమని అన్నారు. ప్రాంతీయ వాణిజ్యం, సహకారాన్ని పెంపొందించడానికి దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు.

షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. దానిలో భాగంగానే 53 ఏళ్లలో తొలిసారి గత నెల పాక్ నుంచి నేరుగా బంగ్లాకు కార్గో షిప్, సరకు రవాణా నౌకలు చేరుకున్నాయి. హసీనా ప్రభుత్వం ఉన్నప్పుడు పాకిస్థాన్ నుంచి వచ్చే కార్గోను భౌతికంగా తనిఖీ చేయాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దానిని తొలగించింది. దాంతో కార్గో తరలింపు పాక్ నౌకలకు సులభం కానుంది. అయితే సరకు రవాణా ముసుగులో ఈశాన్య రాష్ట్రాల్లోని వేర్పాటు గ్రూపులకు ఆయుధాలు అందొచ్చని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ప్రమాణస్వీకారం చేసిన తొలి రోజే పెనుమార్పులకు ట్రంప్ శ్రీకారం!

ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తొలి రోజే పెనుమార్పులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏకంగా 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను ఆయన కార్యవర్గం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బైడెన్ జారీ చేసిన ఆదేశాల్లో చాలా వాటిని ట్రంప్ వెనక్కి తీసుకొనే అవకాశాలున్నాయి. ముఖ్యంగా సరిహద్దుల భద్రతకు సంబంధించిన కీలక విధానపరమైన నిర్ణయాలు దీనిలో ఉంటాయని భావిస్తున్నారు.



క్యాపిటల్ హిల్‌లో జరిగిన ఓ ప్రైవేటు సమావేశంలో ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల గురించి ట్రంప్ తన పార్టీ సెనేటర్లకు వెల్లడించినట్లు సమాచారం. సరిహద్దులపై తీసుకునే నిర్ణయాలను ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ ఇప్పటికే సెనేటర్లకు చెప్పారు.

ఈ ఆర్డర్లలో అమెరికా-మెక్సికో సరిహద్దును కట్టడి చేయడం, ఫెడరల్ షెడ్యూల్ ఎఫ్ ఉద్యోగుల నిబంధనలు మార్చడం, స్కూల్ జెండర్ పాలసీలు, టీకాలపై నిర్ణయం వంటివి ఉన్నాయి. ట్రంప్ సహచరులు ఇప్పటికే వీటిని తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రమాణ స్వీకారం రోజునే వీటన్నింటిపై ఆయన ఆదేశాలు జారీ చేసేలా నిర్ణయం తీసుకోనున్నారు. శ్వేతసౌధంలో కొత్త అధ్యక్షుడు అడుగుపెట్టాక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేయడం సహజం. కానీ, ట్రంప్ కార్యవర్గం మాత్రం ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో వీటిని జారీ చేయనుంది.

# లాస్ ఏంజిల్స్‌లో మరింత జోరుగా వ్యాపిస్తున్న కార్చిచ్చు



లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు మరింత వేగంగా వ్యాపిస్తోంది. తాజాగా మృతుల సంఖ్య 16కు చేరింది. ఒక్క ఎటోన్ ఫైర్లోనే 11 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు. తీవ్రమైన గాలులు వీస్తుండటంతో మంటలు ఒకచోట నుంచి మరోచోటుకు వేగంగా వ్యాపిస్తున్నాయి. పాలిసేడ్స్ ఫైర్‌ను 11శాతం అదుపు చేయగలిగినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇది బ్రెంట్వుడ్ వైపు మళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోనే లిబ్రోన్ జేమ్స్, ఆర్నాల్డ్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ నివాసాలు ఉన్నాయి. ఇక్కడి పరిస్థితి కారణంగా ఆమె తన చిట్టచివరి విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇక మరోవైపు ఎటోన్ ఫైర్ మాత్రం కట్టడి కాలేదు.

హాలీవుడ్ స్టార్లపై ఆగ్రహం

హాలీవుడ్ నటులు లాస్‌ఏంజెలెస్‌లో నీటిని ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేయడంతో.. ఇప్పుడు వేల ఇళ్లను మంటల బారి నుంచి కాపాడేందుకు నీటి కొరత ఎదురవుతోంది. ఈ నటులు తమకు కేటాయించిన నీటి కంటే కొన్ని రెట్లు అదనంగా వాడేసుకొని తమ గార్డెన్లను పెంచుతున్నారని డెయిలీ మెయిల్ కథనంలో పేర్కొంది. 2022 నుంచి లాస్‌ఏంజెలెస్‌లో నీటి వినియోగంపై ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. ఎవరైనా సరే తమ తోటకు నీరు పెట్టాలంటే.. వారానికి రెండుసార్లు ఎనిమిది నిమిషాలు మాత్రమే వాడుకోవాలి.

నటి కిమ్ కర్దాషియన్ ది ఒక్కోని తన 60 మిలియన్ డాలర్ల ఇంటి చుట్టు తోటను పెంచేందుకు తనకు కేటాయించిన నీరు కంటే 2,32,000 గ్యాలెన్లను అదనంగా వాడుకొన్నట్లు అధికారులు గుర్తించారు. కండల వీరుడు సిల్వెస్టర్ స్టాలోన్, కెవిన్ హార్ట్ వంటి వారు అదనంగా నీరు వాడుకుని జరిమానాలు చెల్లించారు. కార్చిచ్చు ప్రారంభమైన ప్రదేశానికి దగ్గర్లోనే కిమ్ కర్దాషియన్ ఇల్లు ఉంది. తాజాగా ఆమె కూడా ఇంటిని ఖాళీ చేసింది. కొందరు హాలీవుడ్ స్టార్లు గంటకు 2 వేల డాలర్లు చెల్లించి.. ప్రైవేటు ఫైర్‌ఫైటర్లను నియమించుకున్నారు. ప్రస్తుతం లాస్ ఏంజెలెస్ నగరంలో దాదాపు 57 వేల ఇళ్లకు కార్చిచ్చు ముప్పు పొంచి ఉందని అంచనాలున్నాయి.

### అమెరికా చరిత్రలో ఇది దారుణ విపత్తు: ట్రంప్

దక్షిణ కాలిఫోర్నియా కార్చిచ్చుపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అమెరికా చరిత్రలో చోటుచేసుకున్న అత్యంత దారుణమైన విపత్తుల్లో ఈ కాలిఫోర్నియా కార్చిచ్చు ఒకటని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఒక పోస్టు పెట్టారు.

'లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు ఇంకా రగులుతూనే ఉంది. దానిని ఎలా అదుపు చేయాలో రెస్క్యూ టీమ్స్‌కు అంతుబట్టడం లేదు. ఇప్పటికే పలు ఇళ్లు కాలిపోయాయి. ఇంకా చాలా ఇళ్లు కాలిపోయే ప్రమాదం ఉంది. ఆ ప్రదేశం అంతా మరుభూమిలా మారింది. దేశ చరిత్రలో ఇదే అత్యంత దారుణమైన విపత్తు. వాళ్లు మంటలను అదుపు చేయలేకపోతున్నారు. అందులో వాళ్ల తప్పేముంది..?' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.



# గాజాలో విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నమైంది

◆మలాలా యూసఫ్ జాయ్ ఆవేదన

హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవైపు ఆకలి కేకలు.. మరోవైపు విధ్వంసపు ఆనవాళ్లతో స్థానికంగా దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 46 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందినట్లు గాజా ఆరోగ్య విభాగం ఇటీవల వెల్లడించింది. ఈ పరిణామాల నడుమ నోబెల్ పురస్కార గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ ఓ సదస్సులో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. గాజాలో అంతర్జాతీయ చట్టాలు, హక్కుల ఉల్లంఘనలను లేవనెత్తుతూనే ఉంటానన్నారు..

"గాజాలో విద్యావ్యవస్థను ఇజ్రాయెల్ పూర్తిగా నాశనం చేసింది. దాదాపు 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసింది. దీంతో పాలస్తీనా చిన్నారులు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారు. పాఠశాల భవనాల్లో తలదాచుకుంటున్న పౌరులపైనా టెల్‌అవీవ్ సేనలు విచక్షణారహితంగా దాడులు జరిపాయి. విశ్వవిద్యాలయాలపైనా బాంబులతో విరుచుకుపడ్డాయి" అని మలాలా ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలో అంతర్జాతీయ చట్టాలు, హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఇజ్రాయెల్ దుశ్చర్యలపై నిరంతరం గళం విప్పుతూనే ఉంటానని తెలిపారు. మరోవైపు అఫ్గానిస్థాన్‌లో మహిళల హక్కులను కాలరాస్తున్న తాలిబన్ల ప్రభుత్వానికి చట్టబద్ధత కల్పించవద్దని ఆమె కోరారు.

# మార్చి 23 నుంచి ఐపీఎల్ 2025

## - కీలక ప్రకటన చేసిన రాజీవ్ శుక్లా..!

ఐపీఎల్ 2025 గురించి కీలక ప్రకటన వెలుగులోకి వచ్చింది. మార్చి 14 నుంచి మొదలు కావాల్సిన ఐపీఎల్ టోర్నీ ఆలస్యంగా ప్రారంభం కానుంది. ఐపీఎల్ తదుపరి సీజన్ తేదీలను మార్చిన ట్లు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా తెలిపారు. ఇప్పుడు ఐపీఎల్ 2025 మార్చి 23నుంచి ప్రారంభమవుతుందన్నారు. కానీ ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ తేదీ గురించి ఇంకా ప్రకటించలేదు. ఐపీఎల్ కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.




**త్వరలో మరిన్ని అంశాలపై..**

ఇటీవల ముంబై ప్రధాన కార్యాలయంలో బీసీసీఐ సమావేశం జరిగింది. ఇందులో పలు కీలక అంశాలపై చర్చించారు. ఇప్పుడు తదుపరి సమావేశం జనవరి 18 లేదా 19న నిర్వహించవచ్చు. ఇందులో ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి టీమిండియా జట్టును ఖరారు చేయనున్నారు. దీంతో పాటు ఐపీఎల్‌కు సంబంధించి కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపీఎల్ 2025 తేదీని మార్చి 23కి మార్చారు. దీంతో ఈ టోర్నీ ఇప్పుడు కాస్త ఆలస్యంగా ప్రారంభం కానుంది.

**కారణమిదేనా..**

వాస్తవానికి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ మార్చి 9న జరగనుంది. కాగా టోర్నీలో తొలి సెమీఫైనల్ మార్చి 4న, రెండో సెమీఫైనల్ మార్చి 5న జరగనుంది. ఇది జరిగిన వెంటనే మార్చి 14 నుంచి ఐపీఎల్ ప్రారంభం కావాల్సి ఉంది. ఆ క్రమంలో ఆటగాళ్లకు పెద్దగా విరామం లభించడం లేదు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ కోసం మార్చిలో పాకిస్థాన్, యూఏఈలో జరగనున్న ఐపీఎల్‌లో పలువురు విదేశీ ఆటగాళ్లు కూడా పాల్గొంటారు. అందువల్ల వారికి కూడా విశ్రాంతి లభించదు. అందుకే ఐపీఎల్ ప్రారంభ తేదీని మార్పు చేసినట్లు తెలుస్తోంది.

**ఐపీఎల్ 2025 తేదీని ఎందుకు మార్చారు..**

ఐపీఎల్ ప్రారంభ తేదీని ఎందుకు మార్చారనే దానిపై అధికారిక సమాచారం రాలేదు. ఐపీఎల్ 2025 షెడ్యూల్ కూడా ఇంకా విడుదల కాలేదు. అయితే త్వరలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. ఈ సీజన్ మెగా వేలం జెద్దాలో జరిగింది. ఇందులో రిషబ్ పంత్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. రూ.27కోట్లకు పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది.

# టీమిండియా మహిళల క్రికెటర్ల సంచలనం

## - 50 ఓవర్లలో 370/5తో కళ్లు చెదిరే స్కోర్ నమోదు!



భారత మహిళల క్రికెట్ జట్టు వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసింది. తాజాగా జరిగిన మ్యాచ్ లో అత్యధిక స్కోర్‌ను నమోదు చేసింది. ఐర్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో ఈ ఘనత సాధించింది.

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో ఆదివారం రెండో వన్డేలో తలపడ్డారు భారత అమ్మాయిలు. ఈ మ్యాచ్ లోనే అత్యంత భారీ స్కోర్ చేశారు. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 370 పరుగులు చేశారు.

వన్డేల్లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. గతంలో మన అమ్మాయిల అత్యధిక స్కోర్ 358/2గా ఉంది. 2017లో ఇదే ఐర్లాండ్ జట్టుపై భారత్ 2 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. గతేడాది డిసెంబర్‌లోనూ టీమిండియా, విండీస్‌పై కూడా ఇదే స్కోర్ (358/5) నమోదు చేయడం విశేషం.

టీమిండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు చెలరేగి ఆడారు. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (91 బంతుల్లో 102: 12 ఫోర్లు) అద్భుత సెంచరీతో మెరిసింది. టాప్ ఆర్డర్ లో భారత బ్యాటర్లు స్మృతి మంధాన (54 బంతుల్లో 73: 10 ఫోర్లు, 2 సిక్సర్లు), ప్రతిక రావల్ (61 బంతుల్లో 67: 8 ఫోర్లు, సిక్సర్), హర్లీన్ డియోల్ (84 బంతుల్లో 89: 12 ఫోర్లు) సూపర్ ఫాస్ట్ హాఫ్ సెంచరీలతో రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా ప్రెండర్‌గాస్ట్, అర్లీన్ కెల్లీ తలో రెండు వికెట్లు తీశారు. జార్జినా డెంప్సే ఓ వికెట్ సొంతం చేసుకుంది.

**వన్డేల్లో టీమిండియా సాధించిన అత్యధిక స్కోర్లు**

*370/5 ఐర్లాండ్‌పై (2025)*
*358/2 ఐర్లాండ్‌పై (2017)*
*358/5 వెస్టిండీస్‌పై (2024)*
*333/5 ఇంగ్లాండ్ పై (2022)*
*325/3 దక్షిణాఫ్రికాపై (2024)*
*317/8 వెస్టిండీస్‌పై (2022)*
*314/9 వెస్టిండీస్‌పై (2024)*
*302/3 సౌతాఫ్రికాపై (2018)*

కాగా, ఐర్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది టీమిండియా. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 238 పరుగులు చేసింది. కెప్టెన్ గాబీ లెవిస్ (92) అత్యధిక స్కోరర్‌గా నిలిచింది. లియా పాల్ (59) హాఫ్ సెంచరీతో మెరిసింది.

భారత బౌలర్లలో ప్రియా మిశ్రా 2, టిటాస్ సాధు, సయాలీ సత్ఘరే, దీప్తి శర్మ తలో వికెట్ తీశారు. ఛేదనలో భారత్ 34.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. ప్రతిక రావల్ (89), తేజల్ హసబ్నిస్ (53 నాటౌట్) అర్ధ శతకాలు చేశారు. స్మృతి మంధాన (41) పర్వాలేదనిపించింది. ఐర్లాండ్ బౌలర్ అమీ మగ్వైర్ 3 వికెట్లు దక్కించుకుంది.

# 42ఫోర్లు, 16 సిక్సర్లతో ట్రిపుల్ సెంచరీ

## *- తొలి భారత క్రికెటర్‌గా 14 ఏళ్ల అమ్మాయి ఘనత*



సాధారణంగా వన్డే మ్యాచ్‌లో జట్టంతా కలిసి 350+ స్కోరు సాధిస్తే అదో పెద్ద గొప్ప. మరి అలాంటిది ఒక్కరే మూడు అంకెల స్కోర్ సాధిస్తే విశేషమే కదా. తాజాగా టీమిండియా యువ మహిళా బ్యాటర్ ఇరా జాదవ్ దాన్నే సాధించింది. ఏకంగా ట్రిపుల్ శతకం బాది అందరి దృష్టిని ఆకర్షించింది. తద్వారా అండర్ - 19 స్థాయిలో ఉన్నప్పుడే.. ఈ ఘనత సాధించిన తొలి మహిళా భారత క్రికెటర్‌గా నిలిచింది.

ఈ మార్క్‌ను తాజాగా మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో సాధించింది 14 ఏళ్ల ఇరా. ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఈ అమ్మాయి.. 157 బంతుల్లోనే 346 పరుగులు చేసింది. ఇందులో 42 ఫోర్లు, 16 సిక్సర్లు ఉండటం విశేషం. అయితే రీసెంట్‌గా జరిగిన డబ్ల్యూపీఎల్ వేలంలో ఇరా జాదవ్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. కానీ ఇప్పుడు ఆమెనే ఈ ట్రిపుల్ సెంచరీ ఘనతను సాధించి ఔరా అనిపించింది.

***మ్యాచ్ సాగిందిలా***

వన్డేల్లో రెండు జట్లు కలిసి చేసే స్కోరును.. తాజా మ్యాచ్ లో ముంబయి ఒక్కటే సాధించేసింది. ఇరా జాదవ్ ట్రిపుల్ సెంచరీ, కెప్టెన్ హర్లే గాలా (116) సెంచరీ తోడవ్వడంతో ముంబయి ఈ నెంబర్ ను టచ్ చేయగలిగింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ కు దిగిన ముంబయి 50 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు కోల్పోయి 563 పరుగుల స్కోర్ చేసింది.

ఎలినా ముల్లా (8)తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇరా.. హర్లేతో కలిసి రెండో వికెట్‌కు 274 పరుగులు జోడించింది. శతకం తర్వాత హర్లే ఔటైతే.. దీక్ష పవార్ (39)తో కలిసి మూడో వికెట్‌కు 186 పరుగులు నమోదు చేసింది. దీక్ష ఔట్ అయిన తర్వాత మితాలీ హర్షద్ (26) తో కలిసి నాలుగో వికెట్ పడకుండా స్కోరును 563 పరుగులకు తీసుకెళ్లింది. పైగా నాలుగో వికెట్‌కు కేవలం 33 బంతుల్లోనే 64 పరుగుల పార్ట్‌నర్ షిప్ నిర్మించడం విశేషం.

***19 పరుగులకే ఆలౌట్***

ముంబయి నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని మేఘాలయ ఛేదించలేకపోయింది. మరీ దారుణంగా 19 పరుగులకే ఆలౌటైంది. దీంతో మేఘాలయపై 544 పరుగుల భారీ తేడాతో ముంబయి జట్టు విజయం సాధించింది. ముంబయి బౌలర్లలో జీయా 3, యయాతి 3, రితికా 2, అక్షయ 2 వికెట్లు దక్కించుకున్నారు.

# ఈ ప్లేయర్ వెరీ కాస్ట్లీ!!

## నిమిషానికి రూ.21కోట్ల జీతం, 42ని.మిలకు రూ.895కోట్లు

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా రిషభ్ పంత్ నిలిచిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంత్ ను రూ.27 కోట్లకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ దక్కించుకుంది. దాదాపు రెండు నెలల పాటు సాగే ఐపీఎల్ లో, తాను ఆడే మ్యాచ్ లన్నింటికీ కలిపి ఈ జీతాన్ని అందుకుంటాడు పంత్.


మరి నిమిషానికి రూ.21 కోట్లు తీసుకునే ప్లేయర్ ఉన్నాడని మీకు తెలుసా. చదువుతుంటే షాకింగ్ గా ఉంది కదూ. కానీ మీరు చదివింది నిజం. ఓ ప్లేయర్ తాను ఆడినందుకుగానూ, మ్యాచ్ ఫీజు నిమిషానికి అక్షరాల రూ.21 కోట్లు అందుకున్నాడు. మొత్తంగా కేవలం 42 నిమిషాలు ఆడి రూ.895 కోట్లను సంపాదించాడు. అతడు మరెవరో కాదు బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్.

సౌదీ ప్రో లీగ్ లో భారీ డీల్స్

ప్రపంచవ్యాప్తంగా క్రీడల్లో క్రికెట్ కన్నా అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఆటల్లో ఫుట్ బాల్ కూడా ఒకటి. అందుకే ఫుట్ బాల్ ప్లేయర్స్ కు ఫుల్ డిమాండ్ ఉంటుంది. లీగుల్లో ఆటగాళ్ల అందుకునే కాంట్రాక్ట్, రెమ్యునరేషన్ కళ్లు చెదిరే రీతిలో ఉంటాయి. ముఖ్యంగా సౌదీ ప్రో లీగ్ లో ప్లేయర్స్ భారీ డీల్స్ అందుతుంటాయి. అందుకే ఈ లీగ్ లో స్టార్ ఫుట్ బాలర్స్ క్రిస్టియానో రొనాల్డో, కరీమ్ బెంజెమా, సాడియో మానే ఇలా చాలామంది ఆడుతుంటారు. అలా 2023లో పారిస్ సెయింట్ జెర్మెయిన్ ను వదిలేసి సౌదీ ప్రో లీగ్ లోని అల్ హిలాల్ జట్టుతో కలిశాడు బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్. అతడిని ఆ జట్టు ఒక సంవత్సరానికి గానూ ఏకంగా రూ.895.2 కోట్లకు డీల్ కుదుర్చుకుంది. దీంతో అతడు ప్రపంచంలోనే అత్యధిక జీతాన్ని అందుకున్న టాప్ -3 ప్లేయర్స్ లో ఒకడిగా నిలిచాడు.

ఒక్క టచ్ కు రూ.10 కోట్లు

అయితే ఇక్కడ విషయమేమిటంటే నేమార్ తాను అందుకున్న మొత్తానికి 2024లో కేవలం 42 నిమిషాలు మాత్రమే మ్యాచ్ ఆడాడు. అంటే పిచ్ పై అతడు ఉన్నందుకు నిమిషానికి రూ.21.2 కోట్లు అందుకున్నాడన్న మాట. మరో విషయమేమిటంటే తాను ఆడిన రెండు గేమ్స్ లో 45 సార్లు మాత్రమే బంతిని టచ్ చేశాడు. అంటే ఈ లెక్కన ఒక్క సారి బంతిని టచ్ చేసినందుకు అతడు రూ.10 కోట్లు అందుకున్నాడు. ఇది క్రీడా ప్రపంచంలో మైండ్ బ్లోయింగ్ నెంబర్ అనే చెప్పాలి. ప్రస్తుతం ఈ విషయం ప్రపంచ క్రీడల్లో షాకింగ్ గా మారింది.



బ్లో అప్

శ్రద్ధా శ్రీనాథ్



# కార్ రేస్‌లో అజిత్ టీమ్ విజయం..

**దుబాయ్‌లో జరిగిన రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో హీరో అజిత్ కుమార్ (అజిత్) జట్టు**





కొత్త ఏడాదిలో ప్రత్యేకమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు కోలీవుడ్ నటుడు అజిత్ కుమార్. 'అజిత్ కుమార్ రేసింగ్ పేరుతో ఇటీవల ఒక రేసింగ్ టీమ్ను ప్రకటించిన ఆయన తాజాగా తన టీమ్ తో కలిసి దుబాయ్ వేదికగా జరుగుతోన్న 24 హెచ్ దుబాయ్ కారు రేసింగ్‌లో పాల్గొని విజయాన్ని అందుకున్నారు. హోరా హోరీగా జరిగిన ఈ పోటీల్లో ఆయన టీమ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల యాక్సిడెంట్ నుంచి తప్పించుకున్న ఆయన ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ రేసులో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. స్పిరిట్ ఆఫ్ రేస్ అనే అవార్డును ఆయనకు టీమ్ బహూకరించింది. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. అజిత్‌కు నెటిజన్లు అభినందనలు చెబుతున్నారు.

బైక్, కార్ల రేసింగ్‌కు ఎంతగానో ఇష్టపడే అజిత్.. 13 ఏళ్ల తర్వాత మోటార్ రేసింగ్‌లో పాల్గొన్నారు. ఈ రేసు కోసం ఎన్నో రోజుల నుంచి శ్రమిస్తున్నారు. ఇటీవల ట్రాక్‌పై ప్రాక్టీస్ చేస్తుండగా ఆయన కారు ప్రమాదానికి గురైంది. గోడను బలంగా ఢీ కొనడంతో కారు ముందు భాగం డ్యామేజ్‌కు గురైంది. బ్రేక్స్ ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలుస్తోంది.

ప్రస్తుతం అజిత్ తన 62వ చిత్రం 'విదా ముయార్చి'లో నటిస్తున్నారు. మాగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో అజిత్ సరసన త్రిష నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఇది విడుదల కావాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని చెప్పింది. ఇది కాకుండా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ద్విభాష చిత్రంలోనూ నటిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఏప్రిల్ 10న ఇది విడుదల కానుంది.



# "గేమ్ ఛేంజర్" థియేటర్స్‌లో సరికొత్త సర్‌ప్రైజ్ !

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎన్నో అంచనాల మధ్య జనవరి 10న ఈసినిమా విడుదలైంది. సాంకేతిక కారణాల వల్ల ఈ సినిమాలోని ఫీల్‌గుడ్ మెలోడి 'నానా హైరానా'ను చిత్రబృందం విడుదల చేయలేదనే విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి ఆ పాటను యాడ్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. 'నానా హైరానా' పాటను బిగ్ స్క్రీన్‌పై చూసి ఎంజాయ్ చేయమని కోరింది.

'గేమ్ ఛేంజర్' సినిమా బడ్జెట్ దాదాపు రూ.400 కోట్లు కాగా అందులో రూ.75 కోట్లు పాటలకే ఖర్చు చేశామని నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో చిత్రీకరించిన ఫస్ట్ ఇండియన్ సాంగ్ 'నానా హైరానా' రికార్డు సృష్టించి 'మెలోడీ ఆఫ్ ది ఇయర్'గా నిలిచింది. న్యూజిలాండ్లో 6 రోజుల పాటు దీని షూటింగ్ జరిగింది. ఈ ఒక్క పాట కోసమే దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. తమన్ సంగీతం అందించగా రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం యూత్ను ఎంతో ఆకట్టుకుంది. ఈ గీతాన్ని కార్తిక్, శ్రేయా ఘోషల్ ఆలపించారు.

సాంకేతిక కారణాల వల్ల ఈ పాటను రిలీజ్ చేయలేకపోతున్నామని సినిమా విడుదల రోజు టీమ్ ప్రకటించింది. "ఇన్‌ఫ్రారెడ్ ఇమేజ్‌ల ప్రాసెసింగ్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ కారణంగా ప్రస్తుతం దీన్ని ప్రదర్శించలేకపోతున్నాం. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం. జనవరి 14 నుంచి ఈ పాటను సినిమాలో జోడిస్తాం. దీనికోసం మా టీమ్ అంతా రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తోంది" అని చెప్పింది. చెప్పిన దాని కంటే రెండు రోజుల ముందుగానే ఈ పాటను యాడ్ చేయడంపై సినీ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## విడుదలకి సిద్ధంగా 'ది ఫ్యామిలీ మ్యాన్ - 3'!

'ది ఫ్యామిలీ మ్యాన్ 3' కోసం నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ మూడో పార్ట్ పై కొత్త అప్ డేట్ వినిపిస్తోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దాదాపుగా పూర్తి అయిందని.. అవుట్ ఫుట్ అద్భుతంగా ఉందని తెలుస్తోంది. మొత్తానికి 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సీరీస్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పటివరకు వచ్చిన ఈ సిరీస్ రెండు సీజన్లు సూపర్ హిట్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఈ సిరీస్ మూడో సీజన్ కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.

ఇక ఈ మూడో పార్ట్‌పై మనోజ్ బాజ్‌పేయి రీసెంట్‌గా క్లారిటీ ఇచ్చారు. 'త్వరలో సరికొత్తగా ఈ ఫ్యామిలీ మ్యాన్ మీ ముందుకు రాబోతున్నాడ"ని ఆయన చెప్పుకొచ్చారు. ఈ మూడో సీజన్ లో దేశభక్తుడైన గూఢచార పోలీసు అధికారి శ్రీకాంత్ తివారీగా మనోజ్ బాజ్‌పేయి కనిపించనున్నారు మనోజ్. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రియమణి, షరీబ్ హష్మీ, శ్రేయా ధన్వంతరీ, వేదాంత్ సిన్హా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# బాలయ్యబాబు ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

**'డాకు మహారాజ్' సక్సెస్ ఈవెంట్‌పై అప్డేట్ ఇచ్చిన నిర్మాత నాగవంశీ..**



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బాబీ కొల్లి తెరకెక్కించిన ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో.. ప్రజెంట్ డాకు సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న చిత్ర బృందం వరుసగా మీడియాతో ముచ్చటిస్తున్నారు. ఇందులో భాగంగా 'డాకు మహారాజ్' సక్సెస్ ఈవెంట్‌పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చాడు నిర్మాత నాగవంశీ. 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు అయిన అనంతపురంలోనే సక్సెస్ ఈవెంట్ నిర్వహిస్తామని నిర్మాత నాగవంశీ తెలిపారు. త్వరలోనే వేడుక ఉంటుందన్నారు.

ఆదివారం విడుదలైన ఆ సినిమాకి మంచి ప్రేక్షకాదరణ వస్తున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన ఈ విషయాలు చెప్పుకొచ్చారు. ఈ ప్రెస్‌మీట్‌లో నాగవంశీతోపాటు దర్శకుడు బాబీ, హీరోయిన్లు ప్రజ్ఞా జైస్వాల్ పలు విషయాలు పంచుకున్నారు. కాగా.. 'డాకు మహారాజ్' చిత్రం విడుదలకు ముందు పీ రిలీజ్ ఈవెంట్‌ను అనంతపురంలో నిర్వహించాలని చిత్ర బృందం భావించింది. కానీ, తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై విచారం వ్యక్తం చేసిన టీమ్ తమ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేసుకుంది. అందుకే తమ సక్సెస్ ఈవెంట్‌ను మాత్రం అనంతపురంలోనే ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు నిర్మాత నాగవంశీ.

# 'విజయ్' ఎంట్రీ సీన్స్ కోసం స్పెషల్ సెట్

శ్యామ్ సింగ రాయ్ ఫేమ్ 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూట్ ఈ నెల నాలుగో వారం నుంచి స్టార్ట్ కానుందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్ లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్స్ ను షూట్ చేస్తారట. ఎంట్రీ సన్నివేశాల షూట్ కోసం ప్రత్యేకంగా ఓ సెట్ ను వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీన్స్ సినిమా మొత్తానికే హైలైట్ గా ఉంటాయట. ఇక, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ

పూర్తిగా సరికొత్త గెటప్ లో కనిపిస్తాడని.. ముఖ్యంగా విజయ్ లుక్ చాలా కొత్తగా ఉంటుందని టాక్ నడుస్తోంది.

కాగా, 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. పైగా ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. మరి నిజంగానే ఆయన ఈ సినిమాలో నటిస్తే కచ్చితంగా ఈ సినిమాకి ప్లస్ అవుతుంది. ఎంతైనా 'రాహుల్ సంకృత్యాన్' దర్శకత్వంలో నాని హీరోగా వచ్చిన శ్యామ్ సింగ రాయ్ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దీంతో, విజయ్ దేవరకొండ సినిమా పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

